@vaartanews @mvnewstv
www.mivaartanews.com
TGBIL/25/A0512
మన వార్త
AP EDITION
విజయవాడ
ప్రతి అక్షరం... ప్రజల కోసం
ఆదివారం 27 సెప్టెంబర్ 2026
సంపుటి : 2
సంచిక : 260
పేజీలు : 8 వెల : 5/-




తెలుగు పత్రికా రంగంలో మరో సంచలనం. వినూత్న రీతిలో వెలువడుతూ విశేష ప్రజాదరణ పొందుతున్న మీ వార్తన్యూస్ తెలుగు డిజిటల్ దినపత్రికకు విలేకరులు కావలెను
ఆసక్తి అనుభవం కలిగిన వారు సంప్రదించగలరు.
జిల్లాల వారీగా స్టాఫ్ రిపోర్టర్‌లు,
నియోజకవర్గాల వారీగా ఆర్‌సీ ఇంచార్జీలు,
మండలాల వారీగా విలేకరులు కావలెను.
సీనియర్లకు ప్రాధాన్యం
కొత్తవారికి అవకాశం ఉంటుంది

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL

## ఈసీ ప్రకటనతో అపోహలకు
# తెరపడింది

- ఎన్నికల కమిషనర్ల మధ్య విభేదాలంటూ ప్రచారం
- ఢిల్లీలో కీలక సమావేశంతో క్లారిటీ ఇచ్చిన ఈసీ
- తమ మధ్య విభేదాలు లేవంటూ సంయుక్త ప్రకటన విడుదల
- సోషల్ మీడియాలో స్పందించిన ఏపీ సీఎం చంద్రబాబు
- రాజ్యాంగ సంస్థల సమగ్రతను, విశ్వసనీయతను గౌరవించాలని పిలుపు
- గెలుపోటములను హుందాగా స్వీకరించడమే నాయకత్వ లక్షణమని ఉద్ఘాటన



**అమరావతి**

భారత ఎన్నికల సంఘం (ఈసీఐ)లో కమిషనర్ల మధ్య విభేదాలు తలెత్తాయంటూ వచ్చిన వార్తలపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పందించారు. ఇవాళ ఓ కీలక సమావేశం సందర్భంగా ఈసీ ఇచ్చిన ఏకగ్రీవ ప్రకటనతో అన్ని అపోహలకు తెరపడిందని ఆయన పేర్కొన్నరు. మన రాజ్యాంగ సంస్థల సమగ్రతను, విశ్వసనీయతను ఈ ప్రకటన మరోసారి స్పష్టం చేసిందని ఎక్స్ వేదికగా శనివారం ఆయన పేర్కొన్నారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ అంశంపై నెలకొన్న వివాదం తాజాగా ఈసీ వివరణతో ముగిసిందని తెలిపారు.స్వల్పకాలిక రాజకీయ ప్రయోజనాల కోసం భారత ప్రజాస్వామ్య వ్యవస్థ, ఎన్నికల ప్రక్రియలపై ప్రజల్లో ఉన్న విశ్వాసాన్ని దెబ్బతీసే ప్రయత్నాలు చేయడం దురదృష్టకరమని చంద్రబాబు అభిప్రాయపడ్డారు. ఎన్నికల ఫలితాలు ప్రజల తీర్పును ప్రతిబింబిస్తాయని, - మిగతా3లో



## గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ వేలో
# ట్విన్ టన్నెల్స్

- 2 అడుగుల వెడల్పు - 32 అడుగుల ఎత్తు
- విజయవాడ-కడప-బెంగుళూరు ఎకనామిక్ కారిడార్‌ను కలుపుతూ ఉమ్మడి ప్రకాశం జిల్లా మీదుగా నిర్మిస్తున్న గ్రీన్ ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ వే పనులు జెట్‌స్పీడ్‌లో జరుగుతున్నాయి
- ఇలాంటి అద్భుతమైన గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ వేలో ట్విన్ టన్నెల్స్ మరో వండర్.

**అమరావతి**

విజయవాడ-కడప-బెంగుళూరు ఎకనామిక్ కారిడార్‌ను కలుపుతూ ఉమ్మడి ప్రకాశం జిల్లా మీదుగా నిర్మిస్తున్న గ్రీన్ ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ వే పనులు జెట్‌స్పీడ్‌లో జరుగుతున్నాయి. ఇలాంటి అద్భుతమైన గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ వేలో ట్విన్ టన్నెల్స్ మరో వండర్. - మిగతా3లో



## ఫారం-6లో చట్ట, రాజ్యాంగ
# విరుద్ధమైన మార్పులు

- సీఈసీ ఉద్దేశపూర్వకంగానే ఇలా చేశారు
- సీఈసీ జ్ఞానేష్ కుమార్‌పై కాంగ్రెస్ ఆగ్రహం
- ఫారం 6లో ఆయన చట్ట, రాజ్యాంగ విరుద్ధమైన మార్పులు చేశారని మండిపాటు
- ఓటరు నమోదు ప్రక్రియలో ఈసీ చేసిన మార్పులతో జెన్‌జీ ఓటర్లకు ఆటంకాలు ఏర్పడ్డాయని ఆరోపణలు

## నాగాలాండ్‌లో
# కల్తీ మద్యం కలకలం..

- రెండు రోజుల్లో 19 మంది మృతి
- ఘటనపై సిట్ దర్యాప్తు ప్రారంభం
- మద్యం నమూనాలు ఫోరెన్సిక్ పరీక్షలకు తరలింపు
- 19 మందిని అరెస్టు చేసిన పోలీసులు
- దాదాపు 3 వేల బాటిళ్ల స్వాధీనం
- అనుమానిత మద్యం సేవించొద్దని పోలీసుల హెచ్చరిక






## 'సర్' నోటీసులు.. అత్యవసరమైతే తప్ప వ్యక్తిగత విచారణకు రానక్కర్లేదు

- నోటీసులు అందుకున్నవారు బీఎల్‌వోను కలవక్కర్లేదు.. బీఎల్‌వోలే ఓటర్లక ఇళ్లకు వస్తారు
- రాత్రి షెల్టర్లు, కార్మికులు, పేదలు, నిరాశ్రయుల కోసం డీఈవోలు సహాయ కేంద్రాలు, స్పెషల్ క్యాంపులు ఏర్పాటు చేయాలి
- ఎస్ఐఆర్ కాకుండా ఇతర సమయాల్లో సాధారణ నియమాల ప్రకారం ఫామ్‌లు వాడాలి
- ఈసీఐనెట్‌ను సీనియర్ డీఈసీ అధ్యక్షతన కమిటీ సమీక్షిస్తుంది
- ఎస్ఐఆర్ 20 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో పూర్తయింది
- ఓటర్లు, యువకులు కంటిన్యుయస్ అప్‌డేషన్ ద్వారా పేరు చేర్చుకోవచ్చు

## పరవాడ ఫార్మా కాలుష్యంపై
# పవన్ కల్యాణ్ సీరియస్




- 95 కంపెనీలకు నోటీసులు
- ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆదేశాలతో ఫార్మాసిటీపై పీసీబీ చర్యలు
- సోషల్ మీడియా ఫిర్యాదు ఆధారంగా కాలుష్యంపై తనిఖీలు
- పరవాడలోని 95 ఫార్మా పరిశ్రమలకు షోకాజ్ నోటీసులు జారీ
- వ్యర్థాల నిర్వహణపై పరిశ్రమలకు కీలక దిద్దుబాటు చర్యల ఆదేశం

**అమరావతి**

సోషల్ మీడియాలో వచ్చిన ఒక ఫిర్యాదుపై రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తక్షణమే స్పందించారు. ఆయన ఆదేశాలతో అనకాపల్లి జిల్లా పరవాడ ఫార్మాసిటీలోని 95 పరిశ్రమలకు ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి (ఏపీపీసీబీ) షోకాజ్ నోటీసులు జారీ చేసింది. శుద్ధి చేయని వ్యర్థాలను వర్షపు నీటి కాలువల్లోకి విడుదల చేస్తూ కాలుష్యానికి కారణమవుతున్నారన్న ఆరోపణలపై ఈ చర్యలు తీసుకుంది. వివరాల్లోకి వెళితే, పరవాడ ఫార్మాసిటీ సమీపంలోని డ్రెయిన్లలో - మిగతా3లో

# పేదలకు పట్టాభిషేకం




- ఈ నెల 30న చంద్రబాబు చేతుల మీదుగా పట్టాలు
- ఈ నెల 30న విజయవాడలో ఇళ్ల క్రమబద్ధీకరణ పట్టాల పంపిణీ
- 24,057 కుటుంబాలకు సంపూర్ణ యాజమాన్య హక్కులు
- రూ.9800 కోట్ల విలువైన భూములపై పేదలకు అధికారం
- దశాబ్దాల నాటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపిన కూటమి ప్రభుత్వం
- 8 నియోజకవర్గాల్లోని లబ్దిదారులకు ప్రయోజనం

**అమరావతి**

పేదలకు పూర్తిస్థాయి యాజమాన్య హక్కులు కల్పించే బృహత్తర కార్యక్రమంలో భాగంగా కూటమి ప్రభుత్వం మరో ప్రతిష్ఠాత్మక ఘట్టానికి శ్రీకారం చుట్టింది. దశాబ్దాలుగా నగరవాసులను వేధిస్తున్న ఇళ్ల పట్టాల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా కీలక ముందడుగు వేసింది. విశాఖపట్నంలో ఇటీవల విజయవంతంగా నిర్వహించిన 'పేదలకు పట్టాభిషేకం' కార్యక్రమ స్ఫూర్తితో, ఇప్పుడు విజయవాడలో భారీ ఎత్తున ఇళ్ల క్రమబద్దీకరణ పట్టాల పంపిణీకి సిద్ధమైంది. ఈ నెల 30వ తేదీన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా 24,057 కుటుంబాలకు సంపూర్ణ హక్కులతో కూడిన పట్టాలను అందించనున్నారు. విజయవాడలో ప్రతి ఎన్నికల్లోనూ ప్రధాన అజెండాగా మారుతున్న ఇళ్ల పట్టాల సమస్యకు కూటమి సర్కార్ చరమగీతం పాడుతోంది. దశాబ్దాల క్రితం అందించిన ఎన్టీఆర్ పట్టాలకు చట్టబద్ధత - మిగతా3లో



## పార్లమెంట్‌లో ఎస్సీ, ఎస్టీ ఎంపీలకు మరింత సమయం ఇవ్వండి

- లోక్‌సభ స్పీకర్‌కు జితిన్ రామ్ మాంజీ లేఖ
- సభలో కీలక బిల్లులపై చర్చ జరిగే సమయంలో ఎస్సీ, ఎస్టీలకు అదనపు సమయం ఇవ్వాలన్న మాంజీ
- తమ సామాజిక వర్గానికి తగినంత సమయం అవసరమన్న మాంజీ
- తమ అభ్యర్థనను సీరియస్‌గా పరిగణించాలని విన్నపం

## పండగల సీజన్‌లో బంగారం కొనొద్దు

- ప్రధాని మోదీ విజ్ఞప్తి ఫలిస్తుందా?
- బంగారం కొనుగోళ్లు తగ్గించాలని భారతీయులకు ప్రధాని మోదీ మరోసారి పిలుపు
- విదేశీ మారక ద్రవ్యం ఆదా చేసేందుకే ఈ విజ్ఞప్తి
- పండగల సీజన్‌లో ఈ పిలుపునకు స్పందనపై ఉత్కంఠ
- వినాయక చవితికి 15 శాతం మేర తగ్గిన బంగారం అమ్మకాలు
- పెట్టుబడికి భౌతిక బంగారం కన్నా ఈటీఎఫ్‌లు మేలంటున్న నిపుణులు



# ఫారం-6లో చట్ట, రాజ్యాంగ విరుద్ధమైన మార్పులు

కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్‌పై కాంగ్రెస్ తీవ్ర విమర్శలు గుప్పించింది. ఓటరు నమోదు ప్రక్రియలో భారత ఎన్నికల సంఘం (ఈసీఐ) చేసిన మార్పుల వల్ల తొలిసారి ఓటు వేస్తున్న జెన్‌జీ ఓటర్లకు ఆటంకాలు ఏర్పడ్డాయని ఆరోపించింది. సీఈసీ జ్ఞానేష్ కుమార్ ఉద్దేశపూర్వకంగా చట్టాన్ని, రాజ్యాంగ పద్ధతులను ఉల్లంఘించి ఫారం 6ను ఏకపక్షంగా మార్చారని విమర్శించింది. ఈ విషయాన్ని సుప్రీంకోర్టు సుమోటోగా స్వీకరించి, ఆయనను జవాబుదారీగా చేయాలని కోరింది. యువ ఓటర్ల కోసం ప్రత్యేక నమోదు శిబిరాలను నిర్వహించాలన్న ఈసీ నిర్ణయంపై కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ స్పందించి, ఈ మేరకు 'ఎక్స్'లో పోస్ట్ పెట్టారు.
శుక్రవారం రాత్రి ఆలస్యంగా ఆందోళనకు గురైన ఎన్నికల సంఘం యువ ఓటర్ల కోసం ప్రత్యేక నమోదు శిబిరాలను నిర్వహించాలని నిర్ణయించింది. సోషల్ మీడియా ద్వారా ఓటర్ ప్రత్యేక నమోదు శిబిరాలకు విస్తృత ప్రచారం కల్పించాలని అధికారులను ఆదేశించింది. కానీ స్వయంగా సీఈసీయే ఫారం- 6లో స్పష్టంగా చట్టవిరుద్ధమైన, రాజ్యాంగ విరుద్ధమైన మార్పులు చేసి, యువ ఓటర్లను చేర్చడాన్ని దాదాపు అసాధ్యం చేశారు. దరఖాస్తుదారుడి తల్లిదండ్రులు లేదా తాతలు గత స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్)లో భాగంగా ఉన్నారా? లేదా? అనే వివరాలను కోరుతూ ఫారం-6లో ఒక కొత్త తప్పనిసరి విభాగాన్ని చేర్చారు. ఇది తొలిసారి ఓటు వేస్తున్న జెన్‌జీ ఓటర్లకు అడ్డంకిగా మారింది. ఈ మార్పు పూర్తిగా చట్టవిరుద్ధం- జైరాం రమేశ్, కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి

**ఫారం-6ను దొంగచాటుగా మార్చారు**

2026 జులై ప్రారంభంలో ఎలాంటి అధికారిక ప్రకటన



లేకుండా ఫారం-6ను దొంగచాటుగా మార్చారని జైరాం రమేశ్ ఆరోపించారు. ఇది ఈసీ మొదటి ఉల్లంఘన అని పేర్కొన్నారు. 'ఉల్లంఘన 2: ఫారం- 6ను సవరించే అధికారం ఈసీఐకి లేదు. ప్రజా ప్రాతినిధ్య చట్టం- 1950 ప్రకారం ఈ అధికారం కేవలం కేంద్ర ప్రభుత్వానికి మాత్రమే ఉంది. ఇది ఎన్నికల సంఘం స్పష్టమైన అతిక్రమణ. ఉల్లంఘన 3: ఓటర్ల నమోదు నిబంధనలు- 1960 ప్రకారం ఎలాంటి సవరణ చేయకుండా ఫారం-6ను మార్చారు. పార్లమెంటుకు సరైన సమాచారం ఇచ్చి కేంద్ర ప్రభుత్వం మాత్రమే అలా చేయగలదు. ఒక శాసనబద్ధమైన ఫారంను, కలవరపడిన ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా ద్వయం ఆదేశాల మేరకు సీఈసీ జ్ఞానేశ్ కుమార్ ఏకపక్షంగా మార్చారు. సుప్రీంకోర్టు తక్షణమే సుమోటోగా కేసును స్వీకరించి, ఈ విషయానికి సీఈసీని జవాబుదారీగా చేయాలి. లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ చెప్పినట్లుగా జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేసి అప్రూవర్‌గా మారడం ద్వారా తన తప్పును సరిదిద్దుకోవచ్చు. ముఖ్యంగా భారత యువత అటువంటి చర్యను ఆమోదిస్తుంది' అని జైరాం రమేశ్ పేర్కొన్నారు.

**'జ్ఞానేశ్ కుమార్ చట్టాన్ని ఉల్లంఘించారు'**

ా×=కు సంబంధించిన నిర్ణయాలు, ఆదేశాలపై ఎన్నికల కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సంధు, వివేక్ జోషి 10 నెలల వ్యవధిలో కనీసం 14సార్లు అభ్యంతరం వ్యక్తం చేశారని ఇటీవలే ఓ ప్రముఖ పత్రిక తన నివేదికలో పేర్కొనడంపైనా జైరాం రమేశ్ స్పందించారు. యువ, తొలిసారి ఓటు వేసేవారు ఎలాంటి వేధింపులు లేకుండా తమ ఓటు హక్కును నమోదు చేసుకోగలిగేలా ఫారం-6కు సంబంధించిన చట్టవిరుద్ధమైన, అనధికారిక మార్పులను వెనక్కి తీసుకోవాలని ఇద్దరు ఎన్నికల కమిషనర్లు కోరారని పేర్కొన్నారు. సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజ్యాంగ సంప్రదాయాలు, పద్ధతులను ఉల్లంఘించడమే కాకుండా పార్లమెంట్ ఆమోదించిన చట్టాన్ని కూడా ఉల్లంఘించారని మండిపడ్డారు. ఆయన పదవిలో కొనసాగడం భారత ప్రజలను అవమానించడమేనని అభిప్రాయపడ్డారు.

**జ్ఞానేశ్‌పై విపక్షాలు ఫైర్- బీజేపీ మద్దతు**

సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామాకు ప్రతిపక్షాలు పట్టుపడుతుండగా, ఆయనకు బీజేపీ మద్దతుగా నిలిచింది. ఎన్నికల ఓటముల నుంచి ప్రజల దృష్టిని మళ్లించే ప్రయత్నాలని ప్రతిపక్షాల ఆరోపణలను కొట్టిపారేసింది. ఎన్నికల సంఘం పక్షపాతంగా వ్యవహరించి ఉంటే కేరళ వంటి రాష్ట్రాల్లో ప్రతిపక్షాలు గెలిచి ఉండేవి కావని పేర్కొంది. మరోవైపు, కేంద్ర మంత్రి, ఎన్డీఏ మిత్రపత్ర పార్టీ ఎల్‌జేపీ (రామ్‌విలాస్) నాయకుడైన చిరాగ్ పాసవాన్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఎన్నికల ప్రక్రియపై ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టేందుకు, ఈ ఆరోపణలపై ఎన్నికల సంఘం తన వైఖరిని స్పష్టంగా తెలియజేయాలని అన్నారు. ముఖ్యంగా సీఈసీ ఈ ఆరోపణలపై స్పందించాలని కోరారు.

## హుగ్లీలో టెన్షన్ టెన్షన్

# టీఎంసీ ఎమ్మెల్యే కారుపై కోడి గుడ్లు, రాళ్లతో దాడి

బంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి తర్వాత మమతా బెనర్జీ వర్గం నేతలకు వరుసగా చేదు అనుభవాలు ఎదురవుతున్నాయి. హుగ్లీ జిల్లాలో టీఎంసీ అగ్రనాయకురాలు మమతా బెనర్జీ ఏర్పాటు చేసిన బహిరంగ సభకు హాజరయ్యేందుకు సెరాంపుర్‌కు వెళ్తున్న టీఎంసీ ఎమ్మెల్యే కునాల్ ఘోష్ కారుపై మూక దాడి జరిగింది. ఆయన ప్రయాణిస్తున్న వాహనంపై నల్ల జెండాలు పట్టుకున్న కొందరు వ్యక్తులు రాళ్లు, కోడి గుడ్లు విసిరారు. టీఎంసీ, మమత బెనర్జీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ దాడిలో కునాల్ ఘోష్ స్వల్పంగా గాయపడినట్లు తెలుస్తోంది.

**ఇది జంగిల్ రాజ్ పాలన : కునాల్ ఘోష్**

తనపై జరిగిన దాడిని కునాల్ ఘోష్ ఖండించారు. బీజేపీ పాలనను జంగిల్ రాజ్‌గా అభివర్ణించారు. బీజేపీ నాయకులు తన కారుపై రాళ్లు, కోడి గుడ్లతో దాడి చేసి రహదారిని దిగ్బంధించారని ఆరోపించారు. తనపై దాడి జరిగిన సమయంలో అక్కడ పోలీసులు ఎవరూ లేరని చెప్పారు. తాను ఇప్పుడు కోల్‌కతాకు తిరిగి వెళ్తున్నానని అన్నారు. తనపై దాడి చేసినవారిపై ఫిర్యాదు చేయడానికి నేరుగా లాల్ బజార్ లేదా భవాని భవన్‌కు వెళ్తానని స్పష్టం చేశారు.

**మిమ్మల్ని ర్యాలీకి వెళ్లకుండా అడ్డుకుంటున్నారు**

తమ పార్టీకి చెందిన ఎమ్మెల్యే కునాల్ ఘోష్‌పై జరిగిన దాడిపై బంగాల్ మాజీ సీఎం మమతా బెనర్జీ స్పందించారు. సెరాంపుర్‌లో జరగనున్న ర్యాలీకి హాజరు కాకుండా అడ్డుకునేందుకు తృణమూల్ కాంగ్రెస్‌లోని తమ వర్గానికి చెందిన నాయకులను గృహ నిర్బంధంలో ఉంచారని ఆరోపించారు. అదే సమయంలో బీజేపీ కార్యకర్తలు సభాస్థలికి వెళ్లే మార్గాన్ని స్వాధీనం చేసుకున్నారని విమర్శించారు. తమ పార్టీ నిర్వహిస్తున్న ర్యాలీకి వెళ్లేందుకు తనను అనుమతించడం లేదని అన్నారు. టీఎంసీ నాయకులు, కార్యకర్తలపై జరుగుతున్న దాడులను పోలీసులు, బీజేపీ ప్రభుత్వం చూసీచూడనట్లు వ్యవహరిస్తోందని తెలిపారు. కునాల్ ఘోష్ ప్రయాణిస్తున్న కారుపై బీజేపీ గుండాలు దాడి చేశారని మండిపడ్డారు.
"సెరాంపుర్ ర్యాలీ కోసం మేము 15 రోజుల ముందే కోర్టు అనుమతి తీసుకున్నాము. అయినా పోలీసులు నన్ను ఇంటి నుంచి బయటకు వెళ్లనివ్వడం లేదు. బీజేపీకి చెందిన అరాచక శక్తులు రోడ్లను దిగ్బంధించాయి. పోలీసులు ఎక్కడా



కనిపించడం లేదు. పైగా వారు ఈ రోడ్లు దిగ్బంధించిన వారికి సహకరిస్తున్నారు. బీజేపీ నాయకుల దాడిలో టీఎంసీ నేత కునాల్ ఘోష్ కారు ధ్వంసమయ్యింది. ఆయనపై కూడా దాడి జరిగింది. మీరే చెప్పండి ఇది ప్రజాస్వామ్యానికి మంచి పరిణామమేనా? నిజంగానే మీకు (బీజేపీనుద్దేశించి) ప్రజల మద్దతు ఉంటే ప్రతిపక్షాన్ని ఎందుకు అణచివేస్తున్నారు? పోలీసులు తమ యూనిఫాం తీసేసి బీజేపీ జెండాను పట్టుకుంటే సరిపోతుంది. ఇలాంటి ఘటనలు ఆకృత్యాలు కిందికి వస్తాయి. ఇలాంటి ఆకృత్యాలు ఆఫ్రికా దేశాలలో కనిపిస్తాయి. బీజేపీ పాలిత ప్రాంతాలైన ఉత్తర్ ప్రదేశ్, బిహార్‌లలో కూడా ఇలాంటి ఘటనలు జరగడం లేదు. నా సెరాంపుర్ ర్యాలీ కోర్టు అనుమతితోనే జరుగుతోంది. ఇది సజావుగా సాగేలా చూడటం పోలీసులు, అధికారుల బాధ్యత. కానీ పోలీసులు అసలేం పట్టించుకోవడం లేదు"

**సువేందుకు కల్యాణ్ బెనర్జీ ఫైర్**

మరోవైపు, టీఎంసీ సీనియర్ నేత కల్యాణ్ బెనర్జీ సైతం బీజేపీపై మండిపడ్డారు. గత రెండు మూడు రాత్రులుగా సెరాంపుర్ ఇన్‌స్పెక్టర్, పోలీసులు ఇంటింటికీ వెళ్లి మమత ర్యాలీకి హాజరైతే అరెస్టు చేస్తామని ప్రజలను బెదిరిస్తున్నారని ఆరోపించారు. శనివారం ఉదయం కూడా రిష్రాలోని 5, 6వ వార్డులలో మైనారిటీ వర్గాలకు చెందిన మహిళలు బయటకు వస్తే అరెస్టు చేస్తామని హెచ్చరించారని అన్నారు. పోలీసు అధికారాలను అత్యంత చురుకుగా దుర్వినియోగం చేస్తున్న వ్యక్తి సెరాంపుర్ ఇన్‌స్పెక్టరేనని విమర్శించారు. సువేందు అధికారి అతన్ని ఎంతకాలం కాపాడగలరో తాను చూస్తానని, ఈ విషయాన్ని హైకోర్టు దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు. సువేందు అధికారి బీజేపీ అంటేనే గూండాయిజం, అరాచకం, పోలీసులను ఇంటి పనివాళ్లగా వాడుకోవడమని నిరూపించారని ఎద్దేవా చేశారు. మరోవైపు, ఇది సామాన్య ప్రజల నిరసన కాదని, బీజేపీ ముందస్తు ప్రణాళికతో చేసిన దాడి అని టీఎంసీ నేత అసిత్ మజుందార్ ఆరోపించారు.

**బీజేపీ ఏమందంటే?**

మరోవైపు, టీఎంసీ సీనియర్ నేత, ఎమ్మెల్యే కునాల్ ఘోష్‌పై జరిగిన దాడిపై బంగాల్‌లో అధికారంలో ఉన్న భారతీయ జనతా పార్టీ స్పందించింది. ఈ ఘటనను ప్రజల నుంచి వచ్చిన స్వచ్ఛంద స్పందనగా అభివర్ణించింది. ఈ మేరకు ఉత్తరపారా బీజేపీ ఎమ్మెల్యే దీపాంజన్ చక్రవర్తి వ్యాఖ్యానించారు.

# సెప్టెంబర్ 30న ఇండి కూటమి పార్టీల కీలక భేటీ!

కేంద్ర ఎన్నికల సంఘంలో సభ్యుల మధ్యే అభిప్రాయ భేదాలు ఉన్నట్లు జాతీయ మీడియాలో కథనాలు రావడం, ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ విధానంపై ప్రతిపక్షాల ఆందోళనల నడుమ ఇప్పుడు ప్రతిపక్ష ఇండి కూటమి కీలక సమావేశానికి సిద్ధమవుతోంది. ముఖ్యంగా చీఫ్ ఎలక్షన్ కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ తక్షణమే రాజీనామా చేయాలని కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేస్తోంది. ఈ నేపథ్యంలో సెప్టెంబర్ 30న దిల్లీలోని కాన్‌స్టిట్యూషనల్ క్లబ్‌లో ప్రతిపక్ష పార్టీలకు చెందిన నేతలు భేటీ అయ్యే అవకాశం ఉందని తెలుస్తోంది. ఎన్నికల సంఘానికి సంబంధించిన అంశాలు, సర్ ప్రకియపై తమ తదుపరి కార్యాచరణ, సీఈసీని తొలగించాలన్న డిమాండ్‌పై ఈ సమావేశంలో చర్చించే అవకాశం ఉందని సంబంధిత వర్గాల్ని ఉటంకిస్తూ జాతీయ మీడియా పేర్కొంది. ఇక దానికి ముందుగానే సెప్టెంబర్ 29న కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సమావేశమై తమ భవిష్యత్ వ్యూహాన్ని ఖరారు చేయనుంది. మరోవైపు ప్రతిపక్ష పార్టీలు ఇప్పటికే ఈ అంశంపై పరస్పరం సంప్రదింపులు జరుపుతున్నాయి. ఇప్పటికే సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌పై కాంగ్రెస్ నేతృత్వంలోని ఇండి కూటమి అభిశంసన తీర్మానాన్ని ప్రవేశపెట్టే అవకాశాల్ని పరిశీలిస్తున్నాయి. దీనిపై చర్చలు జరుపుతూ, న్యాయ నిపుణుల సలహాలు తీసుకుంటుండగా 1-2 వారాల్లో పార్లమెంట్ ఉభయ సభల్లో (రాజ్యసభ, లోక్‌సభలో) ప్రవేశపెట్టే అవకాశాలు ఉన్నాయి. అంతకుముందు ఈ ఏడాదిలోనే రెండు సార్లు సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌ను తొలగించేందుకు ప్రతిపక్షాలు ఇలాంటి నోటీసుల్ని ప్రవేశపెట్టగా అప్పుడు తిరస్కరణకు గురయ్యాయి. ఇప్పుడు మూడో ప్రయత్నంగా మరోసారి అదే చేయాలని చూస్తున్నాయి.

**సెప్టెంబర్ 29న సీడబ్ల్యూసీ భేటీ**

ఈ పరిణామాల మధ్య కాంగ్రెస్ కూడా ఈ అంశంపై తన వ్యూహాన్ని ఖరారు చేసేందుకు సిద్ధమవుతోంది. సెప్టెంబర్ 29న కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సమావేశం జరగనుంది. ఇక్కడ కూడా సీఈసీ, ా×= వివాదంపై పార్టీ తదుపరి కార్యాచరణను ఈ సమావేశంలో చర్చించే అవకాశం ఉంది. సెప్టెంబర్ 25న కాంగ్రెస్ పార్టీ- దేశవ్యాప్తంగా పలు రాష్ట్రాల్లో విస్తృతంగా నిరసనలు కూడా నిర్వహించింది. సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని పార్టీ నేతలు, కార్యకర్తలు డిమాండ్ చేశారు. సెప్టెంబర్ 30న దిల్లీలో ఇండి కూటమి సమావేశం ఉండొచ్చని సీపీఐ లిబరేషన్ ప్రధాన కార్యదర్శి దీపాంకర్ భట్టాచార్య వెల్లడించారు. ఈ చర్చలు ఇండి కూటమికి మాత్రమే పరిమితం కాకుండా, ఇతర ప్రతిపక్ష పార్టీలు, పౌర సమాజ ప్రతినిధులు, మేధావి వర్గం, సంబంధిత పౌరులను కూడా భాగస్వామ్యం చేయాలని ఆయన కోరారు. 'ఎన్నికల సంఘంలో అంతర్గత విభేదాలు బయటపడిన తర్వాత సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌కు ఆ పదవిలో కొనసాగే నైతిక అర్హత ఏ మాత్రం లేదు. ఓటర్ల హక్కుల్ని కాలరాస్తున్న సర్ ప్రక్రియను నిలిపివేసి, ఆయన రాజీనామా చేయాల్సిందే' అని ఆయన డిమాండ్ చేశారు. వామపక్షాలు సహా మరికొన్ని ప్రతిపక్ష పార్టీలు సీఈసీని తొలగించాలని, ా×= ప్రక్రియను నిలిపివేయాలని డిమాండ్ చేస్తున్నాయి. తృణమూల్ కాంగ్రెస్, సీపీఐ (ఎం) మధ్య బంగాల్‌లో రాజకీయ విభేదాలు ఉన్నప్పటికీ ఎన్నికల సంఘం అంశంలో మాత్రం సమన్వయం కోసం సంప్రదింపులు జరుగుతున్నాయి.

**వివాదానికి కారణమైన 14 అభ్యంతరాల రిపోర్ట్**

ది ఇండియన్ ఎక్స్‌ప్రెస్ ప్రచురించిన ఒక రిపోర్ట్ ఈ తాజా రాజకీయ పరిణామాలకు కేంద్రంగా నిలిచింది. దాని ప్రకారం ఎన్నికల సంఘం కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సంధు, వివేక్ జోషి గత 10 నెలల కాలంలో 14 సందర్భాల్లో ఎన్నికల సంఘం నిర్ణయాలు సహా ా×= ప్రక్రియకు సంబంధించిన అంశాలపై అధికారికంగా అభ్యంతరాలు వ్యక్తం చేశారు.

## 'సర్' నోటీసులు..

## అత్యవసరమైతే తప్ప వ్యక్తిగత విచారణకు రానక్కర్లేదు

**ఢిల్లీ:** సర్ ప్రక్రియపై కేంద్ర ఎన్నికల సంఘం కీలక సమావేశం నిర్వహించింది. అంతర్గత విభేదాలు బయటపడిన తర్వాత తొలిసారి జరిగిన భేటీకి సీఈసీ జ్ఞానేశ్‌కుమార్, ఈసీలు సందు, జోషి హాజరయ్యారు. 'సర్'పై కేంద్ర ఎన్నికల సంఘం కీలక నిర్ణయాలు తీసుకుంది. 'సర్'లో అభ్యంతరాలపై నవంబర్ 30 వరకు గడువు పొడిగించింది. నోటీసులు అందుకున్నవారు బీఎల్‌వోను కలవక్కర్లేదని.. బీఎల్‌వోలే ఓటర్లక ఇళ్లకు వస్తారని ఈసీ తెలిపింది. ఎస్ఐఆర్‌లో నోటీసు వచ్చిన వారికి బీఎల్‌వోలు ఇంటికి వచ్చి డాక్యుమెంట్లు తీసుకొని ఈసీఐనెట్‌లో అప్‌లోడ్ చేస్తారు. ఈఆర్వో కార్యాలయానికి వెళ్లాల్సిన అవసరం లేదు. అసాధారణ పరిస్థితుల్లోనే ఆన్‌లైన్ హియరింగ్. కుటుంబ సభ్యుడు కూడా హాజరు కావచ్చు. రాత్రి షెల్టర్లు, కార్మికులు, పేదలు, నిరాశ్రయుల కోసం డీఈవోలు సహాయ కేంద్రాలు, స్పెషల్ క్యాంపులు ఏర్పాటు చేయాలి" అని సీఈసీ పేర్కొన్నారు. "ఎస్ఐఆర్ ఫామ్-6 డిక్లరేషన్‌ను సుప్రీంకోర్టు సమర్థించింది. ఎస్ఐఆర్ కాకుండా ఇతర సమయాల్లో సాధారణ నియమాల ప్రకారం ఫామ్‌లు వాడాలి. ఈసీఐనెట్‌ను సీనియర్ డీఈసీ అధ్యక్షతన కమిటీ సమీక్షిస్తుంది. కొత్త ఐటీ మాడ్యూళ్లు కమిటీ ఆఫ్ ఆఫీసర్స్ ద్వారా ఆమోదం తీసుకోవాలి. ఢిల్లీ క్లెయిమ్స్, అబ్జెక్షన్లు 30 అక్టోబర్ 2026 వరకు, డిస్పోజల్ 30 నవంబర్ 2026 వరకు పొడిగింపు. మహారాష్ట్రలో క్లెయిమ్స్ 12 అక్టోబర్ 2026 వరకు, డిస్పోజల్ 10 నవంబర్ 2026 వరకు పొడిగిస్తున్నాం" అని సీఈసీ తెలిపారు. ఎస్ఐఆర్ 20 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో పూర్తయింది. ఓటర్లు, యువకులు కంటిన్యుయస్ అప్‌డేషన్ ద్వారా పేరు చేర్చుకోవచ్చు. ప్రత్యేక ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్ నిర్వహించాలని సీఈవోలకు ఈసీ ఆదేశించింది. కమిషన్ సమావేశాలకు ముందుగా అజెండా, తర్వాత మినిట్స్ జారీ చేయాలి. అధికారుల ఏపీఏఆర్‌లు ప్రతి సంవత్సరం డిసెంబర్ 31లోపు పూర్తి చేయాలి. విదేశీ పర్యటనలకు కమిషన్ అనుమతి తప్పనిసరి" అని సీఈసీ స్పష్టం చేశారు.

## పార్లమెంట్‌లో ఎస్సీ, ఎస్టీ ఎంపీలకు మరింత సమయం ఇవ్వండి

పార్లమెంట్‌లో ఎస్సీ, ఎస్టీ ఎంపీల గళానికి మరిన్ని అవకాశాలు కల్పించాలని కోరుతూ లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాకు కేంద్ర మంత్రి, ఎన్డీఏ మిత్రపక్ష నేత జితన్ రామ్ మాంజీ ఒక లేఖ రాశారు. పార్లమెంట్‌లో అత్యంత కీలకమైన బిల్లులపై చర్చ జరిగే తరుణంలో, షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగలకు ప్రాతినిధ్యం వహిస్తున్న ఎంపీలకు సభలో మాట్లాడేందుకు మరికొంత అదనపు సమయం కేటాయించాలని ఆయన ఆ లేఖ ద్వారా విజ్ఞప్తి చేశారు. ఢిల్లీలోని తన అధికారిక నివాసంలో ఎన్డీఏ ఎంపీలతో నిర్వహించిన ఒక సమావేశంలో ఈ ప్రధానాంశం చర్చకు వచ్చినట్లు మాంజీ వెల్లడించారు. మధ్యప్రదేశ్‌కు చెందిన బీజేపీ ఎంపీ గజేంద్ర సింగ్ పటేల్ ఈ ప్రస్తావన తెచ్చారని తెలిపారు. తమ సామాజిక వర్గానికి చెందిన ప్రత్యేక సమస్యలు, అంశాలను సభలో వివరంగా ప్రస్తావించేందుకు ఎస్సీ, ఎస్టీ ఎంపీలకు తగినంత సమయం అవసరమని పటేల్ కోరినట్లు మాంజీ తన లేఖలో ప్రస్తావించారు. ఎంపీ గజేంద్ర సింగ్ పటేల్ చేసిన ఈ అభ్యర్థనను సీరియస్‌గా పరిగణించి, తగిన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు అవసరమైతే తగిన ఆదేశాలు జారీ చేయాలని ఆయన స్పీకర్‌ను కోరారు. మరోవైపు, సభలో తమకు అసలు సమయమే కేటాయించడం లేదని తాము అనడం లేదని.. తమ వర్గాల సమస్యలపై మరింత లోతుగా చర్చించేందుకు కేటాయించిన సమయాన్ని మరింత పెంచాలని మాత్రమే కోరుతున్నట్లు ఎంపీ పటేల్ గతంలో ఒక మీడియాతో మాట్లాడుతూ స్పష్టం చేశారు.

## నాగాలాండ్‌లో కల్తీ మద్యం కలకలం



నాగాలాండ్‌లో కల్తీ మద్యం అనుమానిత ఘటనలు కలకలం రేపుతున్నాయి. రెండు రోజుల్లో మద్యం సేవించిన తర్వాత 19 మంది ప్రాణాలు కోల్పోయారు. మొకోక్‌చుంగ్ జిల్లాలో 8 మంది, ట్యూన్‌సాంగ్ జిల్లాలో 11 మంది మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. ఈ ఘటనపై దర్యాప్తు చేసేందుకు ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని (సిట్) ఏర్పాటు చేశారు. అదనపు ఎస్పీ ఐ.బంగ్‌లాంగ్ చాంగ్ నేతృత్వంలో ఈ బృందం పనిచేయనుంది. అనుమానిత కల్తీ మద్యం ఎక్కడి నుంచి వచ్చింది? దాని సరఫరా వెనుక ఎవరున్నారు? అనే అంశాలను సిట్ దర్యాప్తు చేస్తోంది. మద్యం నమూనాలను ఫోరెన్సిక్ పరీక్షల కోసం గువాహటికి పంపించారు. మరణాలకు అసలు కారణం ఏంటో పరీక్షల తర్వాత స్పష్టమవుతుందని పోలీసులు తెలిపారు. కొన్ని ఆధారాలు లభించాయని, అయితే దర్యాప్తు ప్రారంభ దశలో ఉన్నందున వివరాలు వెల్లడించలేమని సీనియర్ ఎస్పీ వెసుప్రా కెజో తెలిపారు. మరణాల నేపథ్యంలో పోలీసులు పలు ప్రాంతాల్లో సోదాలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో 19 మందిని అరెస్టు చేశారు. దాదాపు 3 వేల మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. గుర్తుతెలియని, లేబుల్ లేని లేదా అనుమానిత అక్రమ మద్యాన్ని తాగవద్దని పోలీసులు ప్రజలకు సూచించారు. మద్యం తాగిన తర్వాత తల తిరగడం, చూపు మసకబారడం, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, స్పృహ కోల్పోవడం వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్య సహాయం తీసుకోవాలని హెచ్చరించారు. నాగాలాండ్‌లో 1990 నుంచి మద్య నిషేధ చట్టం అమల్లో ఉంది.

## 'పండగల సీజన్‌లో బంగారం కొనొద్దు'

అత్యవసరమైతే తప్ప బంగారం కొనుగోళ్లకు దూరంగా ఉండాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ భారతీయులకు మరోసారి విజ్ఞప్తి చేశారు. దేశ విదేశీ మారక ద్రవ్య (ఫారెక్స్) నిల్వలను కాపాడుకునేందుకు ఈ చర్య దోహదపడుతుందని ఆయన సూచించారు. త్వరలో రానున్న ధన్‌తేరస్, దీపావళి వంటి కీలక పండగల నేపథ్యంలో ప్రధాని పిలుపునకు ప్రజల నుంచి ఎలాంటి స్పందన వస్తుందనేది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. ఇరాన్ యుద్ధం కారణంగా ఆర్థిక వ్యవస్థపై ప్రతికూల ప్రభావం పడుతున్న నేపథ్యంలో, 2026 మే నెలలో మోదీ తొలిసారి ఈ విజ్ఞప్తి చేశారు. తాజాగా సెప్టెంబర్‌లోనూ ఆయన ఇదే విషయాన్ని గుర్తుచేశారు. భారత్ తన అవసరాలకు సంబంధించి అత్యధిక శాతం బంగారాన్ని దిగుమతుల ద్వారానే పొందుతోంది. 2026 రెండో త్రైమాసికంలో దేశీయ సరఫరాలో 82 శాతం దిగుమతుల నుంచే లభించింది. దీనివల్ల డాలర్ల రూపంలో చెల్లింపులు పెరిగి, సుమారు 780 నుంచి 785 బిలియన్ డాలర్లుగా ఉన్న ఫారెక్స్ నిల్వలపై ఒత్తిడి పెరుగుతోంది. ప్రధాని విజ్ఞప్తి ప్రభావం ఇప్పటికే కొంతమేర కనిపిస్తోంది. ముఖ్యంగా పట్టణ ప్రాంతాల్లో అనవసర కొనుగోళ్లు తగ్గినట్లు తెలుస్తోంది. ఈ ఏడాది వినాయక చవితి సందర్భంగా బంగారం అమ్మకాల పరిమాణం సుమారు 15 శాతం మేర తగ్గింది. వినియోగదారులు ఎక్కువగా తేలికపాటి ఆభరణాలను ఎంచుకోవడం లేదా పాత బంగారాన్ని మార్చుకోవడం వంటి పద్ధతులకు మొగ్గు చూపుతున్నారు. పండగల సమయంలో బంగారం కొనుగోలు చేయడం అనేది సంప్రదాయం, భావోద్వేగాలతో ముడిపడి ఉంటుందని గ్రోత్‌వైన్ క్యాపిటల్ నిపుణుడు శుభమ్ గుప్తా అభిప్రాయపడ్డారు. ఇప్పటికే తగినంత బంగారం ఉన్నవారు ఈసారి లాంఛనంగా కొద్ది మొత్తంలో కొనుగోలు చేయడం మేలని ఆయన సూచించారు. కేవలం పెట్టుబడి కోసమైతే, భౌతిక బంగారానికి బదులుగా గోల్డ్ ఈటీఎఫ్‌లు లేదా గోల్డ్ మ్యూచువల్ ఫండ్స్ ఉత్తమ ప్రత్యామ్నాయాలని ఆయన వివరించారు. ఏదేమైనా, ప్రధాని పిలుపునకు అసలైన పరీక్ష రాబోయే పండగల సీజన్‌లోనే ఎదురుకానుంది.

# గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ వేలో ట్విన్ టన్నెల్స్

-మొదటిపేజీ తరువాయి

కనిగిరి మండలం వంగపాడు వద్ద కొండను తొలుస్తూ 350 మీటర్లు ఏర్పాటు చేస్తున్న రెండు సొరంగ మార్గాలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. 52 అడుగుల వెడల్పు 32 అడుగుల ఎత్తున టన్నెల్స్ నిర్మిస్తున్నారు. విజయవాడ వైపు వెళ్లే దారిలో 300 మీటర్లు, బెంగుళూరు వెళ్లే వైపు మార్గంలో వంద మీటర్ల మేర నిర్మాణం పూర్తయింది. పై గోడల నుంచి మట్టి పెళ్లలు విరిగి పడకుండా ఎప్పటికప్పుడు యంత్రాల సాయంతో కాంక్రీట్‌తో లైనింగ్ చేస్తున్నట్లు మేఘా కంపెనీ ప్రతినిధులు తెలిపారు. అడవిలో కొండల నడుమ సొరంగ మార్గాలు కనువిందు చేస్తున్నాయి. ఈ ఎక్స్‌ప్రెస్ వే పూర్తయితే ఇప్పటివరకు 12 గంటలు పాటు పట్టే ప్రయాణ సమయం ఇకపై ఆరు గంటలు మాత్రమే పడుతుంది. ఈ ప్రాజెక్టు పూర్తయితే కనిగిరి ప్రాంతం పారిశ్రామికంగా, వాణిజ్యపరంగా మరింత అభివృద్ధి చెందే అవకాశం ఉంది.

### 342.24 కిలోమీటర్ల గ్రీన్‌ఫీల్డ్ హైవే

అయితే బెంగళూరు నుంచి విజయవాడ వరకు నేరుగా వెళ్లేందుకు కొత్తగా ఎలాంటి ప్రత్యేక రోడ్డేమీ నిర్మించడం లేదు. బెంగళూరు నుంచి శ్రీసత్యసాయి జిల్లాలోని కొడికొండ చెక్‌పోస్ట్‌కు సమీపంలో గల కోడూరు వరకు వెళ్లాల్సి ఉంటుంది. ప్రస్తుతం అందుబాటులో ఉన్న బెంగళూరు–హైదరాబాద్ హైవేలో 110 కిలోమీటర్లు మేర ప్రయాణించాల్సి వస్తుంది. కోడూరు వద్ద యాక్సెస్ కంట్రోల్ గ్రీన్‌ఫీల్డ్ హైవే మొదలై, 343.24 కిలోమీటర్లు కొనసాగి ప్రకాశం జిల్లాలోని ముప్పవరం వద్ద చెన్నై–కోల్‌కతా రహదారిలో కలుస్తుంది. అక్కడి నుంచి చెన్నై–కోల్‌కతా రహదారిలో 115 కిలోమీటర్లు ప్రయాణించి విజయవాడకు చేరుకోవాలి. అంటే మధ్య 342.24 కిలోమీటర్లు గ్రీన్‌ఫీల్డ్ హైవే ఉంటుంది. దానికి అటూ ఇటూ ఇప్పుడున్న హైవేల్లో 225 కిలోమీటర్లు ప్రయాణించాల్సి ఉంటోంది.



### పనులు జరుగుతున్న తీరిది :

ఈ రహదారి శ్రీసత్యసాయి జిల్లాలో చిలమత్తూరు, గోరంట్ల, ఓడీసీ, పుట్టపర్తి, నల్లమాడ, ముదిగుబ్బ మీదుగా తలుపుల మండలంలోని నామాలగుండు వద్ద వైఎస్సార్ కడప జిల్లాలోకి ప్రవేశిస్తుంది. ఈ 75 కి.మీ.లో 60 శాతానికి పైగా పనులు పూర్తయ్యాయి. పుట్టపర్తి మండలం సాతర్లపల్లి పరిధిలో కొండను తొలిచే పనులు నెమ్మదిగా సాగుతున్నాయి. నల్లమాడ నుంచి మలకవేముల క్రాస్ వరకు 15 కి.మీ. మేర రహదారి పూర్తయింది. మలకవేముల క్రాస్ వద్ద రైల్వే బ్రిడ్జి పనులు కొనసాగుతున్నాయి. మలకవేముల క్రాస్ నుంచి కొండగట్టుపల్లి వరకు బీటీ లేయర్ వేస్తున్నారు. వైఎస్సార్ కడప జిల్లాలో వేముల, పులివెందుల, ఎర్రగుంట్ల, కమలాపురం, చాపాడు, మైదుకూరు, పోరుమామిళ్ల మీదుగా ఈ హైవే వెళ్తోంది. కమలాపురం మండలం కంచెన్నగారిపల్లె వద్ద పెన్నా నదిపై, చాపాడు మండలం అల్లాడుపల్లి వద్ద కుందూ నదిపై భారీ వంతెనల నిర్మాణం, మిగిలిన ప్రాంతాల్లో రోడ్ల పనులు జరుగుతున్నాయి. ఈ జిల్లాలో కొన్నిచోట్ల భూసేకరణ సమస్యలతో పనులు జాప్యమవుతున్నాయి. ఉమ్మడి ప్రకాశం జిల్లా అత్యధికంగా 140 కి.మీ. ఉంది. సింగరాయకొండ నుంచి మైదుకూరు వైపు వెళ్లే ఎన్‌హెచ్–167బీ వద్ద ఇంటర్ ఛేంజ్ పనులు చేస్తున్నారు. మద్రిపూడి నుంచి సోమవరప్పాడు వరకు 13వ ప్యాకేజీలో పనులు చాలావరకు పూర్తయ్యాయి. ఈ ప్రాజెక్ట్‌లో 5.31 కి.మీ. మేర ఏడు సొరంగాలు నిర్మిస్తున్నారు. నెల్లూరు జిల్లా సీతారామపురం మండల సరిహద్దులోని 3.67 కి.మీ. పొడవైన సొరంగం ప్రాజెక్ట్‌లో అతి పెద్దది.

# అంబటి రాంబాబును వెంటాడుతున్న ఈడీ..!

**గుంటూరు :** వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో జరిగినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న ఏపీ మద్యం రవాణా టెండర్ల కుంభకోణం కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ దర్యాప్తును మరింత వేగవంతం చేసింది. ఈ కేసు దర్యాప్తులో భాగంగా వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత, మాజీ జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబుకు ఈడీ అధికారులు నోటీసులు జారీ చేశారు. హైదరాబాద్‌లోని ఈడీ ప్రాంతీయ కార్యాలయంలో జరిగే విచారణకు హాజరు కావాలని అధికారులు ఆయనకు స్పష్టం చేశారు. మద్యం రవాణా కేసులో అంబటి రాంబాబును విచారణ సెగ గట్టిగానే వెంటాడుతోంది. ఈ వ్యవహారంలో ఈడీ అధికారులు ఇప్పటివరకు ఆయనకు రెండుసార్లు నోటీసులు జారీ చేశారు. మొదటగా సెప్టెంబర్ 18న అంబటి రాంబాబుకు తొలిసారిగా ఈడీ నోటీసులు వెళ్లాయి. సెప్టెంబర్ 24న తమ ముందు హాజరుకావాలని అధికారులు అందులో పేర్కొన్నారు. అయితే ఆ సమయంలో తాను ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నానని, పాత తేదీలతో ఉన్న నోటీసులు పంపారంటూ అంబటి రాంబాబు పేర్కొన్నారు. చట్టపరమైన సలహా తీసుకునేందుకు వీలుగా తనకు కొత్త నోటీసు ఇవ్వాలని ఆయన కోరారు. అంబటి రాంబాబు అభ్యర్థన మరియు మునుపటి గడువు ముగిసిన నేపథ్యంలో, ఈడీ అధికారులు సెప్టెంబర్ 24న మరోసారి నోటీసులు జారీ చేశారు. సెప్టెంబర్ 25న ఉదయం 10.30 గంటలకు హైదరాబాద్‌లోని ఈడీ కార్యాలయంలో విచారణకు హాజరు కావాలని అధికారులు స్పష్టం చేశారు. మద్యం డిపోల నుండి షాపులకు మద్యం రవాణా చేసే కాంట్రాక్టును దక్కించుకున్న కొంతమంది వైఎస్సార్‌సీపీ నేతలతో మాజీ మంత్రికి అత్యంత సన్నిహిత సంబంధాలు ఉన్నాయనే ఆరోపణలు వచ్చాయి. ఒకవేళ విచారణ పేరిట ఈడీ కఠిన చర్యలు తీసుకోవడం గానీ, అరెస్టు చేయడం గానీ చేస్తే.. దాన్ని రాజకీయ కక్షసాధింపుగా చిత్రీకరించి విక్టిమ్ కార్డ్ ఉపయోగించాలనేది ఆయన ఆలోచనగా కనిపిస్తోంది. కేంద్రంలో ఉన్న పవర్, విచారణ సంస్థల వద్ద లభించిన దస్త్రాల ఆధారంగా చట్టపరంగా ముందుకెళ్తున్న ఈడీపై ఇలా రాజకీయ రంగు పూయడం ద్వారా కేసు తీవ్రతను తగ్గించేందుకు ప్రయత్నిస్తున్నారు. అయితే, రాజ్యాంగబద్ధమైన కేంద్ర దర్యాప్తు సంస్థల పనితీరును, వారి వద్ద ఉన్న పక్కా మనీ–ట్రయల్ ఆధారాలను తక్కువ అంచనా వేయడం వల్లే అంబటి ఈ తరహా గేమ్స్ ఆడుతున్నారనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఆరోగ్య నెపంతో సమయం దాటవేసే రాజకీయాలు ఎంతో కాలం నిలబడవు. బ్యాంకు లావాదేవీలు, డిజిటల్ సాక్ష్యాలు, బినామీల వాంగ్మూలాలు ఇప్పటికే ఈడీ చేతిలో ఉన్నందున తప్పించుకునే ప్రయత్నాలు ఆయనకు మరిన్ని చిక్కులు తెచ్చిపెట్టే అవకాశాలు ఉన్నాయి. ఈడీ బిగించే ఆర్థిక చక్రబంధం ముందు రాజకీయ ప్రదర్శనలు, ప్రెస్ మీట్లు పనిచేయవని, చట్టబద్ధమైన ప్రక్రియకు హాజరై తన తాను చెప్పే 90 ఎంఎల్ కథలు నిరూపించుకోకపోతే టెండర్ల నిబంధనలను ఉల్లంఘించి, ప్రభుత్వం నిర్దేశించిన రవాణా రేట్లను భారీగా పెంచడం ద్వారా కోట్ల రూపాయల నిధులు దారిమళ్లాయనే కోణంలో దర్యాప్తు జరుగుతోంది. ఈ క్రమంలోనే గత కొన్ని సంవత్సరాలుగా జరిగిన వ్యక్తిగత బ్యాంక్ లావాదేవీల వివరాలు, ఆస్తుల పత్రాలతో సహా విచారణకు రావాలని ఈడీ అధికారులు అంబటి రాంబాబును ఆదేశించారు. ఇప్పటికే ఈ కేసులో పలువురు కీలక వ్యక్తులను అరెస్ట్ చేసిన ఈడీ, అంబటి రాంబాబు విచారణ ద్వారా మరిన్ని కీలక రహస్యాలను ఛేదించాలని భావిస్తోంది.



# ప్రతిష్టాత్మకంగా ఎన్నికలు తీసుకుంటున్న జనసేన

**విశాఖపట్టణం :** ఆంధ్రప్రదేశ్‌లో త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికలను జనసేనపార్టీ అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. క్షేత్రస్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేయడంతో పాటు, కూటమి భాగస్వామ్య పక్షాలతో పక్కా సమన్వయం కోసం ఐదుగురు సభ్యులతో కూడిన ఒక ప్రత్యేక కమిటీని జనసేన అధినేత, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఏర్పాటు చేశారు. ఎన్నికల వేళ గ్రౌండ్ లెవెల్‌లో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా పక్కా వ్యూహంతో ముందుకు వెళ్లేందుకు ఈ నిర్ణయం తీసుకున్నారుఈ కొత్త కమిటీ ఇప్పటికే జనసేన పార్టీలో క్రియాశీలకంగా ఉన్న 14 మంది సభ్యుల ప్రధాన కమిటీతో కలిసి సంయుక్తంగా పని చేయనుంది. ఈ ఐదుగురు సభ్యుల కమిటీ రాష్ట్రవ్యాప్తంగా క్షేత్రస్థాయిలో విస్తృతంగా పర్యటించనుంది. వివిధ జిల్లాల్లో పార్టీ బలాబలాలు, డివిజన్లు మరియు స్థానిక సంస్థల వారీగా అభ్యర్థుల గెలుపు అవకాశాలు, పొత్తుల సమన్వయంలో ఎదురవుతున్న సవాళ్లపై లోతుగా అధ్యయనం చేసి ఈ ప్రత్యేక టీమ్ ఒక సమగ్ర నివేదికను సిద్ధం చేయనుంది. ఈ కమిటీలు క్షేత్రస్థాయి నుంచి సేకరించి సమర్పించే నివేదికల ఆధారంగా జనసేన అధినేత పవన్ కల్యాణ్ పార్టీ సీనియర్ నేతలతో కలిసి ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించనున్నారు. ఆ నివేదికల ఆధారంగానే స్థానిక సంస్థల ఎన్నికల్లో జనసేన అనుసరించాల్సిన రాజకీయ వ్యూహాలు, సీట్ల సర్దుబాట్లపై పవన్ కల్యాణ్ క్యాడర్‌కు దిశానిర్దేశం చేయనున్నారు. మున్సిపల్, కార్పొరేషన్ ఎన్నికల వేళ సీట్ల పంపకాలపై కూటమిలో అంతర్గత చర్చలు నడుస్తున్న తరుణంలో జనసేన ఈ ప్రత్యేక కమిటీని రంగంలోకి దించడం రాజకీయ వర్గాల్లో ప్రాధాన్యత సంతరించుకుంది. స్థానిక సంస్థల ఎన్నికలు జనసేన పార్టీ నాయకత్వానికి ఒక సవాల్ గా మారాయి. ఇన్నాళ్లూ ఓపిక పట్టిన నేతలు ఎంతకాలం నుంచో ఈ ఎన్నికల కోసం కాచుక్కూర్చుని ఉన్నారు. పవన్ కల్యాణ్ పై అభిమానంతో పార్టీ జెండాను పట్టుకుని వదలకుండా పన్నెండేళ్ల నుంచి చేతబూనిన వారు ఈ ఎన్నికల్లో ఖచ్చితంగా పోటీ చేయాలని భావిస్తున్నారు. పవన్ కల్యాణ్ కూడా సీట్ల షేరింగ్ లో రాజీ పడబోమని చెప్పడం కొంత ఊరట నిచ్చే అంశమే. అయితే చివరకు సీట్ల షేరింగ్ విషయంలో పవన్ కల్యాణ్ కు పెద్ద సమస్య గా మారనుంది. సీట్ల షేరింగ్ ఎక్కువ అడిగితే వాటిని ఖచ్చితంగా గెలిపించుకోవాలి. తగ్గించుకుంటే ప్రత్యర్థులే కాకుండా సొంత పార్టీ నేతల నుంచి కూడా ప్యాకేజీ అంటూ కామెంట్స్ చేస్తారు. రాజీ పడకుండా.. రహదారి ఏంటి? అన్నదే పవన్ కల్యాణ్ ముందున్న ప్రశ్న. ఏ నిర్ణయమైనా పవన్ కల్యాణ్ కు ఈ ఎన్నికలు పెద్ద సమస్యగా మారాయని చెప్పాలి. ఆంధ్రప్రదేశ్ స్థానిక సంస్థల ఎన్నికల్లో సీట్ల సర్దుబాటు విషయంలో జనసేన అధినేత, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ చాలా స్పష్టమైన, దూకుడు వైఖరిని ప్రదర్శిస్తున్నారు. కాకినాడలో జరిగిన పార్టీ కీలక సమావేశంలో ఆయన చేసిన వ్యాఖ్యలు కూటమి రాజకీయాల్లో పెద్ద చర్చకు దారితీశాయి. ప్రపంచ పటాలు పరిశీలించండి 2024 అసెంబ్లీ ఎన్నికల సమయంలో బీజేపీని కూటమిలోకి తెచ్చే క్రమంలో టీడీపీ అభ్యర్థన మేరకు జనసేన సీట్లు తగ్గించుకుంది. కానీ, స్థానిక సంస్థల ఎన్నికల్లో మళ్లీ సీట్లు తగ్గిస్తామంటే ఒప్పుకునేది లేదని పవన్ కళ్యాణ్ తేల్చి చెప్పారు. చేసిన త్యాగాలు చాలని, సీట్ల కేటాయింపులో ఎలాంటి రాజీ పడబోమని స్పష్టం చేశారు. స్నేహపూర్వక పోటీకైనా సిద్ధమని ప్రకటించడం ఇప్పుడు సరికొత్త రాజకీయాలకు తెరలేపినట్లయింది. పొత్తుల లెక్కల్లో భాగంగా ఎక్కడైనా స్థానిక నాయకత్వాల మధ్య ఏకాభిప్రాయం కుదరకపోతే, కొన్ని స్థానాల్లో స్నేహపూర్వక పోటీ కి వెడదామని క్యాడర్‌కు దిశా నిర్దేశం చేశారు. అంటే ఒకరకంగా టీడీపీకి పరోక్షంగా వార్నింగ్ ఇచ్చిన పవన్ కల్యాణ్ అదే సమయంలో స్థానికంగా కూటమి నేతల మధ్య సయోధ్యను కుదుర్చుకోవాల్సిన బాధ్యత మీదేనంటూ లోకల్ లీడర్లపై పవన్ నెట్టేయడం కూడా ఒక రకంగా చర్చకు దారి తీసింది. ఒకే వార్డులో కూటమిలోని రెండు పార్టీలు పోటీ పడాల్సి వచ్చినా వెనకడుగు వేయొద్దని కార్యకర్తలకు ధైర్యం చెప్పారు. అదే సమయంలో కూటమి ధర్మం పాటించాలని పిలుపు నిచ్చారు. గత ఐదేళ్లలో ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొని నిలబడిన గ్రౌండ్ లెవల్ కార్యకర్తలను, వీరమహిళలను ఈ ఎన్నికల ద్వారా బలోపేతం చేయాలనేది పవన్ ప్రధాన లక్ష్యం. 15 శాతం సీట్లు మాత్రమే జనసేనకు ఇస్తారంటూ వస్తున్న ప్రచారాన్ని ఆయన కొట్టిపారేశారు. వంద శాతం స్టయిక్ రేట్ లక్ష్యంగా పనిచేయాలని పార్టీకి బలమున్న ప్రతి చోటా అభ్యర్థులను నిలబెట్టాలని, అసెంబ్లీ ఎన్నికల తరహాలోనే స్థానిక ఎన్నికల్లో కూడా 100 శాతం విజయాల రేటును నమోదు చేయాలనే వ్యూహంతో ముందుకు వెళ్తున్నారు. ఎన్నికల సన్నద్ధత, వ్యూహాల కోసం ప్రత్యేక కమిటీని నియమించారు. ప్రచార కమిటీ బాధ్యతలను మంత్రి కందుల దుర్గేష్‌కు అప్పగించారు. మీరు అన్నట్లుగానే పవన్ కళ్యాణ్ తాజా స్పీచ్‌ను బట్టి చూస్తే, స్థానిక సంస్థల ఎన్నికల్లో జనసేన పార్టీ తన ఆత్మగౌరవాన్ని, క్యాడర్ ప్రయోజనాలను పణంగా పెట్టి సీట్ల విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ వెనక్కి తగ్గే సూచనలు కనిపించడం లేదు. మరి చివరకు ఏం జరుగుతుందన్నది చూడాలి.



## ఈసీ ప్రకటనతో అపోహలకు తెరపడింది

-మొదటిపేజీ తరువాయి

బలమైన ప్రజాస్వామ్యంలో గెలుపును, ఓటమిని సమానంగా, హుందాగా స్వీకరించడమే నిజమైన నాయకత్వ లక్షణమని హితవు పలికారు. రాజ్యాంగ సంస్థలను గౌరవించడం అత్యంత ముఖ్యమని, భారత ప్రజాస్వామ్య ప్రక్రియపై ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టడం పార్టీలకు అతీతంగా నాయకులందరి ఉమ్మడి బాధ్యత అని ఆయన గుర్తుచేశారు.

### సంయుక్త ప్రకటనతో వివాదానికి ముగింపు

కాగా, గత కొద్ది రోజులుగా తమ మధ్య తీవ్ర విభేదాలు ఉన్నాయంటూ వస్తున్న ఊహాగానాలకు భారత ఎన్నికల సంఘం పూర్తిస్థాయి కమిషన్ శనివారం తెరదించింది. ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్, ఎన్నికల కమిషనర్లు సుఖ్బీర్ సింగ్ సంధు, వివేక్ జోషి న్యూఢిల్లీలోని నిర్వాచన్ సదన్‌లో సమావేశమయ్యారు. అనంతరం ముగ్గురూ కలిసి ఉన్న ఫోటోతో పాటు ఒక సంయుక్త ప్రకటనను విడుదల చేశారు. కమిషన్ అంతర్గత పనితీరు, ఓటర్ల జాబితా సవరణ, సాంకేతిక వ్యవస్థలపై వస్తున్న ఆరోపణలను తీవ్రంగా ఖండించారు.

### వివాదానికి నేపథ్యం ఇదే..


ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణకు సంబంధించిన పలు నిర్ణయాలపై కమిషనర్లు సంధు, జోషి అభ్యంతరాలు వ్యక్తం చేశారంటూ సెప్టెంబర్ 23న ఓ ప్రముఖ ఆంగ్ల పత్రికలో కథనం ప్రచురితమైంది. ఈ కథనం దేశవ్యాప్తంగా రాజకీయ దుమారం రేపింది. ప్రతిపక్ష పార్టీలు ఎన్నికల సంఘం పనితీరుపై సందేహాలు వ్యక్తం చేస్తూ, మరింత పారదర్శకత అవసరమని డిమాండ్ చేశాయి. ఈ నేపథ్యంలోనే పూర్తిస్థాయి కమిషన్ సంయుక్తంగా స్పందించి, తమ మధ్య ఎలాంటి విభేదాలు లేవని స్పష్టం చేసింది. రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కోసం 2025 జూన్ 24న జారీ చేసిన ఆదేశాలను ముగ్గురు కమిషనర్లు ఏకగ్రీవంగా ఆమోదించారని ఈసీ తన ప్రకటనలో పేర్కొంది. ఆ తర్వాత కార్యక్రమ షెడ్యూళ్లను కూడా ఏకాభిప్రాయంతోనే విడుదల చేశామని తెలిపింది. ఈ ఆదేశాలను సుప్రీంకోర్టు సైతం సమర్థించిందని గుర్తుచేసింది. నిర్ణయాలన్నీ సమష్టిగా, సంస్థాగత విధివిధానాలను అనుసరించే తీసుకుంటామని కమిషన్ స్పష్టం చేసింది.

## పరవాడ ఫార్మా కాలుష్యంపై పవన్ కల్యాణ్ సీరియస్..

-మొదటిపేజీ తరువాయి

నల్లటి రంగులో, దుర్వాసనతో కూడిన నీరు ప్రవహిస్తున్నట్లు శుక్రవారం ఇన్‌స్టాగ్రామ్‌లో ఒక వీడియో పోస్ట్ అయింది. ఈ వీడియో ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ దృష్టికి వెళ్లడంతో, వెంటనే క్షేత్రస్థాయిలో విచారణ జరిపి వాస్తవాలపై సమగ్ర నివేదిక ఇవ్వాలని ఆయన పీసీబీ అధికారులను ఆదేశించారు. డిప్యూటీ సీఎం ఆదేశాలతో రంగంలోకి దిగిన పీసీబీ అధికారులు, వీడియోలో కనిపించిన ప్రాంతాల్లో తనిఖీలు చేపట్టారు. నమూనాలను సేకరించి పరిశీలించగా, శుద్ధి చేయని వ్యర్థ జలాలు వర్షపు నీటి కాలువల్లోకి చేరుతున్నట్లు ప్రాథమికంగా గుర్తించారు. దీనికి బాధ్యులుగా ఫార్మాసిటీలోని మొత్తం 95 కంపెనీలకు షోకాజ్ నోటీసులు జారీ చేసి, ఏడు రోజుల్లోగా వివరణ ఇవ్వాలని ఆదేశించారు. కేవలం నోటీసులు ఇవ్వడమే కాకుండా, కాలుష్య నివారణకు పలు కఠినమైన దిద్దుబాటు చర్యలను కూడా పీసీబీ తప్పనిసరి చేసింది. పరిశ్రమల ప్రాంగణంలోనే వర్షపు నీటిని నిల్వ చేయాలని, కలుషిత నీటిని బయటకు వదలరాదని స్పష్టం చేసింది. వ్యర్థాల నిర్వహణను డిజిటలైజ్ చేయాలని, తేదీ, సమయంతో సహా రికార్డ్ చేసే సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేసి ఫుటేజీని ఆరు నెలల పాటు భద్రపరచాలని సూచించింది. ఆన్‌లైన్ మానిటరింగ్ వ్యవస్థతో కూడిన స్క్రబ్బర్లను వాడాలని, పర్యావరణ అనుమతుల నిబంధనలను కచ్చితంగా పాటించాలని ఆదేశాల్లో పేర్కొంది. నిర్ణీత సమయంలో సంతృప్తికరమైన సమాధానం ఇవ్వని, అక్రమంగా వ్యర్థాలను విడుదల చేస్తున్నట్లు తేలిన పరిశ్రమలపై పర్యావరణ పరిరక్షణ చట్టాల ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని పీసీబీ హెచ్చరించింది. తీసుకున్న చర్యలపై ఒక సమగ్ర నివేదికను ఉప ముఖ్యమంత్రి కార్యాలయానికి పంపినట్లు అధికారులు తెలిపారు

## విజయవాడలో 'పేదలకు పట్టాభిషేకం'




-మొదటిపేజీ తరువాయి

కల్పిస్తూ, వాటిపై లబ్ధిదారులకు పూర్తి యాజమాన్య హక్కులను కట్టబెడుతోంది. ఈ కార్యక్రమం ద్వారా సుమారు రూ. 9,800 కోట్ల విలువైన 617 ఎకరాల భూమిపై పేద, మధ్య తరగతి కుటుంబాలకు అధికారం లభించనుంది. దీనివల్ల ఒక్కో కుటుంబానికి సుమారు రూ. 40 లక్షల నుంచి రూ. 45 లక్షల వరకు లబ్ధి చేకూరనుంది. ముఖ్యంగా, విజయవాడ నగరంలోని మూడు నియోజకవర్గాల పరిధిలో కొండలపై ఇళ్లు నిర్మించుకున్న వారి చిరకాల స్వప్నం ఈ కార్యక్రమంతో నెరవేరబోతోంది. తమ ఇళ్లకు శాశ్వత భద్రత, భవిష్యత్తుకు భరోసా కల్పించాలని కొండ ప్రాంత నివాసితులు ఎన్నో ఏళ్లుగా డిమాండ్ చేస్తున్నారు. ఇటీవల జరిగిన జిల్లా ప్రజాప్రతినిధుల సమావేశంలోనూ ఎన్టీఆర్ జిల్లాకు చెందిన ప్రతినిధులు ఈ అంశాన్ని ప్రత్యేకంగా ప్రస్తావించారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ప్రభుత్వం వేగంగా స్పందించి, ఇప్పుడు 29.86 లక్షల చదరపు గజాల స్థలంపై లబ్ధిదారులకు సంపూర్ణ హక్కులు కల్పిస్తోంది. క్రమబద్ధీకరణ చేస్తున్న భూముల మార్కెట్ విలువ దాదాపు రూ. 24,297 కోట్లుగా ఉంటుందని అంచనా. ఈ పట్టాల పంపిణీ ద్వారా ఎన్టీఆర్ జిల్లాలోని ఏడు, కృష్ణా జిల్లాలోని గన్నవరం సహా మొత్తం 8 నియోజకవర్గాల్లోని 15 మండలాల ప్రజలకు ప్రయోజనం చేకూరనుంది. సామాజిక వర్గాల వారీగా చూస్తే బీసీలు 12,093, ఓసీలు 6,130, ఎస్సీలు 4,546, ముస్లిం బీసీలు 955, ఎస్టీలు 333 కుటుంబాలు ఈ పథకం ద్వారా లబ్ధి పొందనున్నాయి.

### నియోజకవర్గాల వారీగా లబ్ధిదారుల సంఖ్య:

విజయవాడ (తూర్పు) – 7,990, విజయవాడ (పశ్చిమం) – 7,465, విజయవాడ (సెంట్రల్) – 5,815, గన్నవరం – 602, జగ్గయ్యపేట – 1,135, మైలవరం – 981 నందిగామ – 54 తిరువూరు – 15

# ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల విచారణ వేగవంతం చేయాలి

**బాధితులకు సత్వర పరిహారం అందించాలి: మంత్రి "డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి"**

**ఒంగోలు : సెప్టెంబర్ 27 (మీ వార్త జిల్లా ప్రతినిధి)** ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల దర్యాప్తును వేగవంతం చేసి, బాధితులకు సత్వర న్యాయం, పరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డా. డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి అధికారులను ఆదేశించారు. దాడులు, దౌర్జన్యాలకు పాల్పడిన వారిపై చట్ట ప్రకారం త్వరితగతిన చర్యలు తీసుకునేలా కేసుల విచారణను సమన్వయంతో ముందుకు తీసుకెళ్లాలని సూచించారు.
ప్రకాశం భవన్‌లో జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు అధ్యక్షతన నిర్వహించిన ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సమావేశానికి మంత్రి హాజరై మాట్లాడారు. జిల్లాలో ఈ ఏడాది 58 ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదయ్యాయని, వాటిలో 9 కేసులు ప్రస్తుతం కోర్టుల్లో విచారణలో ఉన్నాయని తెలిపారు. మిగిలిన కేసుల్లో దర్యాప్తు, ఛార్జ్‌షీట్ దాఖలు ప్రక్రియను వేగవంతం చేయాలని పోలీసు అధికారులను ఆదేశించారు.

**విద్యార్థుల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు**

ఎస్సీ, ఎస్టీ విద్యార్థుల విద్యాభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందని మంత్రి తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 600 మంది ఇంటర్మీడియట్ విద్యార్థులకు ఐఐటీ, నీట్ ప్రవేశ పరీక్షలను లక్ష్యంగా చేసుకుని కార్పొరేట్ సంస్థల ద్వారా ప్రత్యేక బోధన అందిస్తున్నట్లు వివరించారు. ఒంగోలులో అంబేద్కర్ స్టడీ సర్కిల్‌ను అందుబాటులోకి తీసుకురావడంతో పాటు నైపుణ్యాభివృద్ధి, యూపీఎస్సీ వంటి పోటీ పరీక్షలు, ఉపాధి అవకాశాల కోసం అవసరమైన శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

**నెల రోజుల్లో స్మశాన స్థలాల సమస్య పరిష్కారం**

ఎస్సీ, ఎస్టీ వర్గాల సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు కలెక్టర్ పి.రాజాబాబు తెలిపారు. స్మశాన వాటికలకు స్థలాలు లేని గ్రామాలను గుర్తించి, అందుబాటులో ఉన్న ప్రభుత్వ భూమిని నెల రోజుల్లోగా కేటాయించేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఎస్సీ, ఎస్టీల సమస్యలను నేరుగా తెలుసుకుని పరిష్కరించేందుకు ప్రతి నెల మూడో సోమవారం ప్రత్యేక గ్రీవెన్స్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వివరించారు.

**అట్రాసిటీ కేసుల దర్యాప్తుపై ప్రత్యేక దృష్టి**

జిల్లా ఎస్పీ వి.హర్షవర్ధన్ రాజు మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల దర్యాప్తును త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. కేసుల దర్యాప్తు, శిక్షల విషయంలో ప్రకాశం జిల్లా రాష్ట్రంలోని టాప్ 5 జిల్లాల్లో ఉందని పేర్కొన్నారు. బాధితులకు చట్టపరమైన రక్షణతో పాటు ప్రభుత్వ పరంగా అందాల్సిన పరిహారం సకాలంలో అందేలా సమన్వయంతో పనిచేస్తున్నట్లు వివరించారు. సమావేశంలో కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు, వివిధ శాఖల జిల్లా అధికారులు, పోలీసు అధికారులు, ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



# ఆరోగ్యకరమైన తల్లి, శిశువు మరియు సమాజ నిర్మాణమే అంగనవాడీల లక్ష్యం

**రౌతులపూడి సెప్టెంబరు 26:( మీ వార్త న్యూస్ ప్రతినిధి)** అంగన్వాడీ ఉత్సవ కార్యక్రమంలో భాగంగా ఆరోగ్యవంతమైన తల్లి ఆరోగ్యంవంతమైన శిశువు మరియు ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణమే లక్ష్యంగా అంగన్వాడి సెంటర్లలో కార్యక్రమాలు చేపడుతున్నారని సూపర్వైజర్ వి.నాగమణి తెలిపారు.
రౌతులపూడి సెప్టెంబర్ 26 శనివారం
భారతదేశ ప్రధాని మంత్రి నరేంద్ర మోడీ 25 సంవత్సరాల ప్రజాసేవ సందర్భంగా నిర్వహిస్తున్న సేవా సంకల్ప అభియాన్ లోభాగంగా ఐసిడిఎస్ శంఖవరం ప్రాజెక్టు పరిధిలోని రౌతులపూడి మండలంలోని అంగన్వాడీ కేంద్రాల్లో సెప్టెంబర్ 25 నుండి అక్టోబర్ 7 వరకు అంగన్వాడి ఉత్సవం ప్రతి అంగనవాడి కేంద్రంలో మూడు రోజులపాటు నిర్వహిస్తున్నారు. స్థానికంగా ఉండే పిల్లలు, తల్లులలో చురుకైన భాగస్వామ్యాన్ని ప్రోత్సహించి ప్రీ స్కూలు, ప్రభుత్వ పోషణ, ఆరోగ్యం మరియు మహిళా సంబంధిత పథకాలను గురించి తలలకు తెలియజేస్తారు . పిల్లల కోసం చిన్న చిన్న వినోద కార్యక్రమాలు నిర్వహిస్తారు
ఈ సందర్భంగా రౌతులపూడి 4, శృంగవరం 2 అంగన్వాడీ కేంద్రాల్లో చిన్నారులతో ఆప్యాయంగా ముచ్చటించి వారికి మిఠాయిలు పంపిణీ చేశారు .పిల్లలు ఆరోగ్యం పోషకాహారం వారి పరిశుభ్రత అంగన్వాడి ద్వారా అందుతున్న సేవలపై అవగాహన కల్పించడం



అలాగే అంగన్వాడీ కేంద్రానికి వచ్చిన గర్భిణీ స్త్రీలతో ప్రత్యేకంగా మాట్లాడి గర్భధారణ సమయంలో తీసుకోవలసిన పౌష్టికాహారం,
వ్యక్తిగత పరిశుభ్రత,క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని, వైద్యులు సూచనలు పాటించడం వంటి అంశాలపై అవగాహన కల్పించారు.
ఈ కార్యక్రమంలో భాగంగా అంగన్వాడి కార్యకర్త అంగన్వాడి సెంటర్లకు వస్తున్న గర్భవతిని,బాలింతను, ప్రీస్కూల్ చిన్నారి తల్లిని సన్మానించారు.
అంగన్వాడీ కేంద్రాల ద్వారా అందుతున్న సేవలను ప్రతి కుటుంబం సద్వినియోగం చేసుకోవాలని ఈ సందర్భంగా సూచించారు.
ఈ కార్యక్రమంలో సిడిపిఓ పి వెంకటలక్ష్మి,సూపర్వైజర్ వి నాగమణి అంగన్వాడి కార్యకర్తలు గనిలక్ష్మి, అచ్యుత అంగన్వాడి సహాయకులు, గర్భవతులు బాలింతలు ప్రీస్కూల్ చిన్నారులు తల్లులు పాల్గొన్నారు

# పాత పట్టిసీమ జడ్పీ స్కూల్ నందు జగతి ఫౌండేషన్, విద్యార్థి సమగ్ర వికాస కార్యక్రమం 3సి...

**పోలవరం మీ వార్త సెప్టెంబర్ 26**
పోలవరం మండలం పాత పట్టిసీమ జడ్పీ స్కూల్ నందు విద్యార్థి సమగ్ర వికాస కార్యక్రమం 3సి లో భాగంగా జగతి ఫౌండేషన్, హైదరాబాద్ వారు తమ మొదటి కార్పొరేట్ భాగస్వామి అయిన గ్లోబల్ టెక్నాలజీ సొల్యూషన్స్ ప్రొవైడర్ సి 1 సంస్థతో కలిసి ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులు ఎదుర్కొంటున్న కీలకమైన సమస్యలను పరిష్కరించే ప్రయత్నంలో భాగంగా విద్యార్థులను డిజిటల్ భవిష్యత్తుకు సన్నద్ధం చేయడం, పర్యావరణ స్పృహ ను పెంపొందించడం మరియు ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చు కొనేలా చేయడం లక్ష్యంగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పట్టిసం, పోలవరం మండలం, ఏలూరు జిల్లా ఆంధ్ర ప్రదేశ్ నందు ఏర్పాటుచేసిన కంప్యూటర్ మరియు స్టేమ్ ల్యాబ్ ను శనివారం ఘనంగా ప్రారంభించడం జరిగినది.. ఈ కార్యక్రమంలో
సి1 భాగస్వామ్యం సాంకేతిక నైపుణ్యాన్ని అందించడంతోపాటు పాఠశాలలకు ఆధునిక వసతుల ఏర్పాటుతోపాటు విద్యార్థులకు మెరుగైన అవకాశాలను కల్పించడానికి దోహదపడుతుంది.
ఈ కార్యక్రమంలో భాగంగా పట్టణ మరియు గ్రామీణ ప్రాంతాల్లోని ఐదు ప్రభుత్వ పాఠశాల లను (తెలంగాణలో మూడు పాఠశాలలు, ఆంధ్ర ప్రదేశ్ లో రెండు పాఠశాలలను) దత్తత తీసుకుని మూడేళ్ల కాల పరిమితి లో దాదాపు 1000 మందికి పైగా విద్యార్థులకు ప్రయోజనం చేకూర్చేలా తోడ్పాటును అందిస్తున్నారు... ఈ ప్రారంభోత్సవ కార్యక్రమం శనివారం ఉదయం పట్టిసం జిల్లా పరిషత్ హైస్కూల్ నందు ఘనంగా నిర్వహించారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో సి 1 సంస్థ నుంచి చంద్ర బొడ్డోజు కంట్రీ హెడ్, జిసిసి హెడ్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ ఆఫ్ సీమ రాజేష్ తాతినేని సీనియర్ డైరెక్టర్ ఆఫ్ హ్యూమన్ రిసోర్సెస్, గోపి శ్రీనివాస్ తెడ్లపు సీనియర్ ఫైనాన్స్ డైరెక్టర్ అండ్ సి ఎఫ్ ఓ, రామస్వామి చంద్రశేఖరన్ సీనియర్ డైరెక్టర్ అండ్ డెలివరీ హెడ్, హరికృష్ణ తోట సీనియర్ డైరెక్టర్ ఆఫ్ సేల్స్ ఆపరేషన్స్, తరుణ్ కుమార్ దారం సీనియర్ మేనేజర్ ఆఫ్ ఫెసిలిటీస్ మరియు జగతి ఫౌండేషన్ నుంచి దుర్గా కళ్యాణి ఫౌండర్ అండ్ సీఈవో జగతి ఫౌండేషన్, అబూబకర్ వైస్ ప్రెసిడెంట్ జగతి ఫౌండేషన్ , పాఠశాల ప్రధానోపాధ్యాయులు సూర్యనారాయణ మూర్తి, మరియు సిబ్బంది విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు






# కృత్రిమ మేధస్సు మరియు ఆవిష్కరణలపై అతిథి ఉపన్యాసం

**మచిలీపట్నం సెప్టెంబర్ 26(మీ వార్త ప్రతినిధి)** స్థానిక వై జె ఆర్ డి ఎం ఎస్ ఇంజినీరింగ్ కళాశాల లో ఎస్ ఆర్ ఎం యూనివర్సిటీకి చెందిన హ్యాచ్‌ల్యాబ్ రీసెర్చ్ సెంటర్ సి ఈ ఓ డా. క్రోవి రాజశేఖర్ ప్రత్యేక అతిథిగా విచ్చేసి, అధ్యాపకులు మరియు విద్యార్థులను ఉద్దేశించి కృత్రిమ మేధస్సు, ఆవిష్కరణలు, పరిశోధన మరియు పారిశ్రామిక రంగంలో వస్తున్న నూతన మార్పుల గురించి వివరించారు.అధ్యాపకులతో జరిగిన సమావేశంలో డా. రాజశేఖర్ గారు వివిధ రంగాల్లో కొత్త ఆలోచనలు మరియు పరిశోధనలను ప్రోత్సహించడానికి ఇంక్యుబేషన్ సెంటర్ల ప్రాముఖ్యతను వివరించారు. పరిశోధకులు, అధ్యాపకులు మరియు కొత్తగా వ్యాపారాలను ప్రారంభించాలనుకునే వారికి ఇంక్యుబేషన్ సెంటర్లు ఎలా సహాయపడతాయో వివరించారు. కొత్త ఆలోచనలను ఉపయోగకరమైన ఉత్పత్తులు, సేవలు మరియు వ్యాపారాలుగా మార్చే విధానాన్ని వివరించారు.అలాగే పేటెంట్లు, మేధో సంపత్తి హక్కుల రక్షణ, పేటెంట్లను చెల్లుబాటులో ఉంచే విధానాలు, అలాగే ఎమ్ ఎస్ ఎమ్ ఈ లు మరియు వివిధ వ్యాపార విధానాల ద్వారా ఆవిష్కరణలను వాణిజ్యపరంగా అభివృద్ధి చేసే అవకాశాల గురించి వివరించారు. ముఖ్యంగా పీహెచ్ డి పరిశోధకులు మరియు అధ్యాపకులకు ఎస్ ఆర్ ఎమ్ యూనివర్సిటీతో కలిసి పరిశోధనలు చేసే అవకాశాలు, సంయుక్త పరిశోధన మరియు విద్యా సహకారం గురించి తెలియజేశారు.విద్యార్థులతో జరిగిన సమావేశంలో డిజిటల్ ట్విన్, జాతీయ ఈ–గవర్నెన్స్, భాషిణి, ఇండియా ఏ ఐ వంటి ఆధునిక సాంకేతికతలు మరియు డిజిటల్ వేదికల గురించి వివరించారు. అలాగే కృత్రిమ మేధస్సు (ఏ ఐ), మెషిన్ లెర్నింగ్ (ఎం ఎల్), డీప్ లెర్నింగ్ మరియు ఇమేజ్ డీనాయిజింగ్ వంటి అంశాలను సులభంగా వివరించారు.అదేవిధంగా సహజ భాషా ప్రక్రియ (ఎన్ ఎల్ పి)లో ఉపయోగించే వివిధ పద్ధతులు మరియు వాటి ప్రస్తుత ఉపయోగాల గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థులు మరియు అధ్యాపకులకు పరిశోధన, ఆవిష్కరణలు, పేటెంట్లు,ాా× సాంకేతికతలు మరియు విద్యా--పరిశ్రమల సహకారంపై విలువైన సమాచారం లభించింది.ఉపన్యాసం అనంతరం డా. క్రోవి రాజశేఖర్ ని కళాశాల యాజమాన్యం ఘనంగా సత్కరించింది. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డా. టి. రవి కుమార్ , వైస్ ప్రిన్సిపాల్ డా. పి. నాగ జ్యోతి , సి ఎస్ ఈ విభాగాధిపతి డా. సయ్యద్ సాదత్ అలీ గారు మరియు ఏ ఐ విభాగాధిపతి ప్రొఫెసర్ ఎన్. సుష్మ గారు పాల్గొని డా. రాజశేఖర్ గారిని సత్కరించారు.




# వికలాంగ వృద్ధునికి మూడు చక్రాల సైకిల్ అందచేత.



జంగారెడ్డిగూడెం, పట్టణం లోని డాంగే నగర్ అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో నడవలేని స్థితిలో ఉన్న వృద్ధునికి మూడు చక్రాల సైకిల్ అందచేశారు. శనివారం గౌరీశంకరపురం ఎంపీపీ పాఠశాల దగ్గరలో అద్దె ఇంట్లో నివాసం ఉంటున్న చిటికెన సత్యనారాయణకు మూడు చక్రాల సైకిల్ అందించారు. ఈ సందర్భంగా అంబేద్కర్ యువజన సంఘం వ్యవస్థాపకులు అమృతల రంగా మాట్లాడుతూ పాముకాటుకు గురైన చిటికెన సత్యనారాయణ కాలికి తీవ్రగాయమై నడవలేని స్థితిలో వున్నారని అప్పటి రోటరీ క్లబ్ అధ్యక్షులు పెనుమర్తి సురేష్ కు తెలియపరచగా మూడు చక్రాల సైకిల్ ఏర్పాటుకు కృషి చేసారని తెలిపారు.రోటరీ క్లబ్ మాజీ అధ్యక్షులు పెనుమర్తి సురేష్ మాట్లాడుతూ అంబేద్కర్ యువజన సంఘం సభ్యులు ఆపదలో ఉన్న వారికి సహాయం అందించే వారికి వారధిగా సేవలు అందించడం అభినందనీయం అన్నారు. వృద్ధుని దీన స్థితి గురించి తెలిసిన వెంటనే దాత మద్దుల రాంబాబు ఆర్థిక సహాయం అందించారని తెలిపారు. ఇటువంటి సేవాకార్యక్రమాలు మరిన్ని నిర్వహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో డాంగేనగర్ అంబేద్కర్ యువజన సంఘం గౌరవ అధ్యక్షులు నేలపోలు ప్రభాకరరావు, ఉపాధ్యక్షులు లింగంకుంట శ్రీనివాస్, సభ్యులు పొడిదోలు నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

# పోలవరం ఆటో యూనియన్ ఆధ్వర్యంలో ఘనంగా గణపతి ఉత్సవాలు

**గణనాథుని ఆశీస్సులతో ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలి**
**ఏపీ క్రీడా ప్రాధికార సంస్థ డైరెక్టర్ కొవ్వాసు జగదీశ్వరి విజయ్**



**పోలవరం మీ వార్త సెప్టెంబర్ 26** పోలవరం ఆటో యూనియన్ ఆహ్వానం మేరకు ఏపీ క్రీడా ప్రాధికార సంస్థ డైరెక్టర్, పోలవరం నియోజకవర్గ టీడీపీ నాయకురాలు కొవ్వాసు జగదీశ్వరి విజయ్ దంపతులు ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. బొజ్జ గణపతి స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, అనంతరం కొబ్బరికాయ కొట్టి గణపతి స్వామివారి ఊరేగింపును ప్రారంభించారు.ఈ సందర్భంగా జగదీశ్వరి మాట్లాడుతూ గణనాథుని ఆశీస్సులతో పోలవరం ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఆటో యూనియన్ సభ్యులు, ప్రజలు భక్తిశ్రద్ధలతో గణపతి ఉత్సవాలను నిర్వహించడం అభినందనీయమన్నారు.పండుగలు ప్రజల్లో ఐక్యత, సోదరభావాన్ని పెంపొందించేలా ఆనందోత్సాహాలతో నిర్వహించుకోవాలని ఆమె కోరారు. కార్యక్రమంలో ఆటో యూనియన్ సభ్యులు, భక్తులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# కూటమి పాలనలో ఆర్యవైశ్యులకు గుర్తింపు

**మాజీ రాజ్యసభ సభ్యులు టి జి వెంకటేష్, ఎమ్మెల్యే రోషన్ కుమార్**

**జంగారెడ్డిగూడెం, సెప్టెంబర్ 26 ( మీ వార్త ప్రతినిధి ):**
కూటమి పాలన లో ఆర్యవైశ్యులకు సిఎం చంద్రబాబు మంచి గుర్తింపు నిచ్చారని ఎమ్మెల్యే రోషన్ కుమార్ పేర్కొన్నారు. జిల్లా ఆర్యవైశ్య నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.
ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా మాజీ మంత్రి, మాజీ రాజ్యసభ సభ్యులు, ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర అధ్యక్షులు టి జి వెంకటేశ్ పాల్గొన్నారు. శనివారం పట్టణం లోని ఆలపాటి గంగ భవాని పంక్షన్ హాల్ లో జరిగిన ఈ కార్యక్రమం లో ఆయన మాట్లాడుతూ ఆర్యవైశ్యులకు శాసనసభ్యులు రోషన్ కుమార్ తగిన గుర్తింపు, ఆదరణ ఇస్తున్నారని పేర్కొన్నారు. ఇది శుభపరిణామం అని ఆయన కితాబిచ్చారు. ఆర్యవైశ్యులు సామాజిక దృక్పథంతో ముందుకు సాగాలని పిజి వెంకటేష్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రోషన్ కుమార్ మాట్లాడుతూ ఆర్యవైశ్యులను గుర్తించి తగిన ప్రాధాన్యత కల్పించింది తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు నాయుడుని రోషన్ కుమార్ పేర్కొన్నారు. ఆర్యవైశ్యుల పట్ల ఉన్న అభిమానంతో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అమరావతిలో 58 అడుగుల ఎత్తు గల పొట్టి శ్రీరాములు విగ్రహాన్ని ఏర్పాటు చేసి ఆర్యవైశ్యులపై తనకున్న అభిమానాన్ని చాటారని కొనియాడారు.
తన నియోజకవర్గంలో కూడా ఆర్యవైశ్య సోదరులకు అనేక నామినేటెడ్ పదవులు ఇచ్చే ఆదరించామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు అభిమానులు, యువత మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



# తోటి పీఎంపీ కుటుంబానికి చేయూత

కొయ్యలగూడెం మండలం రేగులగుంట గ్రామానికి చెందిన పీఎంపీ సభ్యులు నల్లజర్ల సుబ్బారావు ఇటీవల గుండెవ్యాధితో మరణించారు. ఆయన కుటుంబ సభ్యులను మండల అధ్యక్షులు ఆనందం సుబ్బారావు, కార్యదర్శి ఆర్ మురళీకృష్ణ,ఉపాధ్యక్షులు యు భాస్కరరావు, సహాయ కార్యదర్శి జి శ్రీనివాసరావు,సభ్యులు పరామర్శించి తమ ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఈ సందర్భంగా వారి కుటుంబ సభ్యులకు నలబై వేల రూపాయలు ఆర్థిక సహాయం చేసారు.అధ్యక్షులు ఆనందం సుబ్బారావు మాట్లాడుతూ అసోసియేషన్ సభ్యుల శ్రేయస్సుకు ఎప్పుడూ బాసటగా ఉంటామని తెలిపారు.



# పొగాకు రైతుల తరపున కేంద్ర ప్రభుత్వానికి ఎంపీ పుట్టా మహేష్ కుమార్ కృతజ్ఞతలు.

ఫలించిన ఎంపీ పుట్టా మహేష్ కుమార్ కృషి.
. రైతులు అదనంగా పండించిన పొగాకును ఎలాంటి పెనాల్టీ లేకుండా వేలం కేంద్రాల్లో అమ్ముకునేందుకు అనుమతిస్తూ కేంద్రం ఉత్తర్వులు.
50 వేల చొప్పున వడ్డీ లేని రుణంపై కూడా నోటిఫికేషన్.
అదనపు పొగాకు విక్రయాల అనుమతికి కృషి చేసిన ఎంపీకి పొగాకు రైతుల కృతజ్ఞతలు.





ఏలూరు, సెప్టెంబర్ 26: రాష్ట్ర ప్రభుత్వం, ఎంపీగా తాను చేసిన విజ్ఞప్తులు, రైతుల ఇబ్బందులు అర్థం చేసుకుని అదనపు పొగాకు అమ్మకాలకు అనుమతి ఇస్తూ కేంద్రం నోటిఫికేషన్ ఇవ్వడం పట్ల ఎంపీ పుట్టా మహేష్ కుమార్ హర్షం వ్యక్తం చేశారు. పొగాకు రైతుల తరపున కేంద్ర ప్రభుత్వానికి, పొగాకు బోర్డుకు ఎంపీ కృతజ్ఞతలు తెలియచేశారు. ఈమేరకు మీడియాకు ఒక ప్రకటన విడుదల చేసిన ఎంపీ, పొగాకు బోర్డు గతంలోనే అంగీకరించిన విధంగా బార్న్‌కు రూ.50 వేల చొప్పున వడ్డీ లేని రుణానికి ఆమోదం తెలపడంతో పాటు, 2025-26 పంట కాలంలో అదనపు పొగాకు విక్రయాలకు అనుమతి ఇస్తూ కేంద్రం గెజిట్ నోటిఫికేషన్ ఇవ్వడం పట్ల ఎంపీ పుట్టా మహేష్ కుమార్ హర్షం వ్యక్తం చేశారు. పొగాకు బోర్డులో నమోదైన డీలర్లు, వ్యాపారులు ఎలాంటి పెనాల్టీలు, ఇబ్బందులు లేకుండా సాధారణ సర్వీస్ ఛార్జీలు చెల్లించి పొగాకును వేలం ద్వారా కొనుగోలు చేయడానికి కేంద్రం అనుమతించింది. దీనితోపాటు బార్న్‌కు రూ.50 వేల చొప్పున వడ్డీ లేని రుణం నిర్ణయం వల్ల దాదాపు 44 వేల మంది రైతులకు రూ.220 కోట్ల వరకూ ఉపశమనం కలుగుతుందని ఎంపీ వెల్లడించారు.

ఈ సందర్భంగా సెప్టెంబర్ 13న జంగారెడ్డిగూడెం ప్రాంతానికి చెందిన పొగాకు రైతులు, రైతు సంఘాల నేతలు తనను కలిసి బోర్డు నిర్దేశించిన కోటాకు మించి పండిన పంటను కూడా వేలం కేంద్రాల్లో విక్రయించేందుకు అనుమతి ఇప్పించమని కోరిన విషయాన్ని, దీనిపై రైతులకు హామీ ఇచ్చిన మేరకు తాను కేంద్ర వాణిజ్య మంత్రి పీయూష్ గోయల్ తో, అధికారులతో మాట్లాడిన విషయాన్ని ఎంపీ గుర్తు చేశారు. తనతో పాటు ముఖ్యమంత్రి చంద్రబాబు, రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు కేంద్ర మంత్రితో, అధికారులతో మాట్లాడిన ఫలితంగానే తాజా ఉత్తర్వులు వెలువడ్డాయని ఎంపీ పుట్టా మహేష్ కుమార్ తెలిపారు. వీటితో పాటు పొగాకు రైతులకు ఆర్థిక ఉపశమన చర్యల్లో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం ధరల స్థిరీకరణ పథకం కింద లో గ్రేడ్, ఆఫ్ గ్రేడ్ రకాలకు కిలోకి రూ.10 చొప్పున ఆర్థిక సాయం అందించేందుకు ముందుకొచ్చి, దీనికోసం 94 కోట్లు మంజూరు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే ఉత్తర్వులు జారీ చేసిన విషయాన్ని కూడా ఎంపీ పుట్టా మహేష్ కుమార్ ఈ సందర్భంగా గుర్తు చేశారు. అంతర్జాతీయ పరిమాణాల కారణంగా, కొద్ది నెలలుగా పొగాకు మార్కెట్ అనేక ఒడిదుడుకులను ఎదుర్కొందన్న ఎంపీ, ప్రస్తుతం మార్కెట్ ధరలు రోజురోజుకూ మెరుగుపడి ఇప్పుడు యార్డులో పొగాకు కొనుగోలు ధర కేజీ 345 వరకూ చేరిందని, రాబోవు రోజుల్లో మరి కొంత పెరిగే అవకాశం ఉందని చెప్పారు. అదనపు పొగాకు అమ్మకాలకు అనుమతి ఇస్తూ కేంద్రం నోటిఫికేషన్ ఇచ్చిన విషయం తెలిసిన పొగాకు రైతు సంఘం నేతలు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ కు ఫోన్ చేసి తమ సంతోషాన్ని వ్యక్తం చేశారు. గత రెండేళ్లుగా పొగాకు రైతులకు ఇబ్బందులు వచ్చినప్పుడల్లా నేనున్నానంటూ ముందుకు వచ్చి, రైతులకు న్యాయం జరిగేలా కేంద్ర మంత్రుల వద్ద, పొగాకు బోర్డులో రైతుల తరపున గట్టి వాదన వినిపిస్తూ అండగా నిలుస్తున్న ఎంపీకి పొగాకు రైతుల తరపున కృతజ్ఞతలు తెలిపారు.

# చలో విజయవాడ" కార్యక్రమానికి అనుమతులు లేవు

**స్వర్ణ గ్రామం--స్వర్ణ వార్డు ఉద్యోగులకు మార్కాపురం ఎస్పీ "పంకజ్‌కుమార్ మీనా" సూచన**

**మార్కాపురం : సెప్టెంబర్ 27 (మీ వార్త జిల్లా ప్రతినిధి)** స్వర్ణ గ్రామం--స్వర్ణ వార్డు కార్యక్రమానికి సంబంధించి సచివాలయ ఉద్యోగులు చేపట్టనున్న 'చలో విజయవాడ' కార్యక్రమానికి ఎలాంటి పోలీసు అనుమతులు మంజూరు కాలేదని మార్కాపురం జిల్లా ఎస్పీ "పంకజ్‌కుమార్ మీనా" స్పష్టం చేశారు. అనుమతులు లేని కార్యక్రమాల్లో ఉద్యోగులు పాల్గొనవద్దని సూచిస్తూ, శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా పోలీసు శాఖకు సహకరించాలని ఆయన కోరారు. ఈ మేరకు స్థానికంగా ఎస్పీ చేసిన ప్రకటనపై తాజా సమాచారం కూడా వెలువడింది. స్వర్ణ గ్రామం--స్వర్ణ వార్డు ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం రాష్ట్రవ్యాప్తంగా ఉద్యోగ సంఘాలు ఆందోళన కార్యక్రమాలకు పిలుపునిచ్చిన నేపథ్యంలో 'చలో విజయవాడ' అంశం ప్రాధాన్యత సంతరించుకుంది. సెప్టెంబరు 27న విజయవాడలో భారీ నిరసన కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఉద్యోగ సంఘాల ప్రతినిధులు ప్రకటించినట్లు సంబంధిత వార్తలు వెల్లడిస్తున్నాయి.

**ఉద్యోగుల సమస్యలే కేంద్రంగా ఆందోళన**

స్వర్ణ గ్రామం, స్వర్ణ వార్డు ఉద్యోగులు తమ సర్వీస్ సంబంధిత సమస్యలు, పదోన్నతులు తదితర అంశాలపై కొంతకాలంగా ప్రభుత్వ దృష్టిని కోరుతున్నారు. ఇటీవల ప్రభుత్వం ఆరేళ్ల అర్హత సర్వీసు పూర్తి చేసిన 2019, 2020 నోటిఫికేషన్ల ద్వారా నియమితులైన అర్హులైన ఉద్యోగులకు ఆటోమేటిక్ అడ్వాన్స్‌మెంట్ స్కీమ్ కింద ప్రత్యేక గ్రేడ్ పోస్టు స్కేల్ వర్తింపజేయడానికి అనుమతిస్తూ జీఓ జారీ చేసింది.

అదేవిధంగా అర్హత ఉన్న ఉద్యోగులకు పదోన్నతుల ప్రక్రియను వేగవంతం చేసే అంశంపై కూడా ప్రభుత్వం ఉద్యోగ సంఘాల ప్రతినిధులతో చర్చించినట్లు సమాచారం. నెల రోజుల్లోగా పదోన్నతులకు చర్యలు తీసుకుంటామని మంత్రి డోలా బాల వీరాంజనేయస్వామి హామీ ఇచ్చినట్లు వార్తలు వెలువడ్డాయి.

**అనుమతి లేకుంటే చర్యలు తప్పవు**

ఉద్యోగుల సమస్యలపై నిరసన వ్యక్తం చేయడం ఒక అంశమైతే, ప్రజా రవాణాకు అంతరాయం కలగకుండా, శాంతిభద్రతలకు విఘాతం లేకుండా కార్యక్రమాలు నిర్వహించడం మరో కీలక అంశమని పోలీసు శాఖ స్పష్టం చేస్తోంది. ఈ నేపథ్యంలో అనుమతి లేకుండా ర్యాలీలు, సభలు లేదా ఇతర సామూహిక కార్యక్రమాలు నిర్వహిస్తే నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామని ఎస్పీ హెచ్చరించారు. విజయవాడకు ఉద్యోగులు పెద్ద సంఖ్యలో తరలివెళ్లే అవకాశం ఉన్నందున రహదారులపై రాకపోకలు, ప్రజా రవాణా, సాధారణ ప్రజల దైనందిన కార్యకలాపాలపై ప్రభావం పడకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉందని పోలీసు శాఖ భావిస్తోంది. అదే సమయంలో ఉద్యోగుల డిమాండ్లు, వాటిపై ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలు, తదుపరి కార్యాచరణపై స్పష్టత రావాల్సి ఉంది.

**చట్టబద్ధమైన మార్గంలోనే ఆందోళన**

ఉద్యోగ సంఘాల డిమాండ్లు పరిష్కరించుకోవడానికి ప్రజాస్వామ్య పద్ధతుల్లో నిరసన వ్యక్తం చేసే అవకాశం ఉన్నప్పటికీ, సంబంధిత పోలీసు అనుమతులు, నిబంధనలు పాటించడం తప్పనిసరి. ఈ నేపథ్యంలో మార్కాపురం జిల్లా పరిధిలోని సచివాలయ ఉద్యోగులు అనుమతి లేని కార్యక్రమాలకు దూరంగా ఉండాలని ఎస్పీ పంకజ్‌కుమార్ మీనా సూచించారు.
ప్రజలకు అసౌకర్యం కలగకుండా, శాంతిభద్రతలకు విఘాతం ఏర్పడకుండా, చట్టపరమైన నిబంధనలను ప్రతి ఒక్కరూ పాటించాలని ఎస్పీ విజ్ఞప్తి చేశారు. కొత్తగా ఏర్పడిన మార్కాపురం పోలీసు జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు ఎస్పీ బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా వెల్లడించిన నేపథ్యంలో ఈ హెచ్చరికకు ప్రాధాన్యత ఏర్పడింది.




# ఆర్‌ఆర్ కాలనీలను శరవేగంగా అభివృద్ధి చేస్తాం

**మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి**
**నిర్వాసితుల ప్రతి సమస్యను పరిష్కరిస్తాం**
**ఆర్‌ఆర్ కాలనీల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం**
**కలెక్టర్, జేసీ, జిల్లా అధికారులతో ఎమ్మెల్యే సమీక్ష**





**మార్కాపురం : సెప్టెంబర్ 27 (మీ వార్త జిల్లా ప్రతినిధి)** వెలుగొండ ప్రాజెక్టు నిర్వాసితుల కోసం ఏర్పాటు చేసిన పునరావాస (ఆర్‌ఆర్) కాలనీలను శరవేగంగా అభివృద్ధి చేసి, నిర్వాసితులకు అవసరమైన మౌలిక వసతులు కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి తెలిపారు.
మార్కాపురం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాల్లో జిల్లా కలెక్టర్ ఎం.విజయ సునీత, జాయింట్ కలెక్టర్ పులి శ్రీనివాసులు, వివిధ శాఖల జిల్లా అధికారులతో ఎమ్మెల్యే సమావేశమయ్యారు. వెలుగొండ ప్రాజెక్టు నిర్వాసితుల ఆర్‌ఆర్ కాలనీల్లో నెలకొన్న సమస్యలు, చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై అధికారులతో సమగ్రంగా చర్చించారు.

**ప్రతి నిర్వాసితుడికి న్యాయం**

ఈ సందర్భంగా ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి మాట్లాడుతూ ప్రతి నిర్వాసితుడికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఆర్‌ఆర్ కాలనీల్లో నెలకొన్న సమస్యలను క్షుణ్ణంగా అధ్యయనం చేసి, ప్రాధాన్యత క్రమంలో పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.

**మౌలిక వసతులపై ప్రత్యేక దృష్టి**

ఆర్‌ఆర్ కాలనీల్లో అవసరమైన మౌలిక వసతులు, అభివృద్ధి పనులను వేగవంతం చేయడంపై దృష్టి సారిస్తున్నామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. నిర్వాసితులకు మెరుగైన జీవన పరిస్థితులు కల్పించేందుకు సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

**అధికారులతో సమగ్ర సమీక్ష**

కాలనీల వారీగా సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలను చేపట్టాలని అధికారులతో ఎమ్మెల్యే చర్చించారు. నిర్వాసితుల సమస్యల పరిష్కారంలో జాప్యం లేకుండా అభివృద్ధి పనులను ముందుకు తీసుకెళ్లాలని సూచించారు. సమావేశంలో సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# చిలకలగడ్డ గ్రామం లో ప్రభుత్వ భూమిపై తెదేపా నాయకుల డేగ కన్ను.

**తెదేపా నేతల కబ్జా యత్నమంటూ వైసీపీ నాయకులు గ్రామ ప్రజలు ఆరోపణలు.**



**అనంతగిరి,సెప్టెంబర్ 26 ( మీ వార్త )** అల్లూరి జిల్లా అనంతగిరి మండలం చిలకలగడ్డ గ్రామంలోని సర్వే నెంబర్ 6 లో ప్రభుత్వ భూమిని కొందరు స్థానిక టీడీపీ కార్యకర్తలు కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్నారని వైసీపీ నాయకులు ఆరోపిస్తున్నారు.విషయానికి వస్తే,ఈ భూమిని గతంలో కొందరు గిరిజనులకు ప్రభుత్వం ఇళ్ల స్థలాలు కేటాయించింది.అయితే కాశీపట్నం పంచాయతీ పల్లంవలస గ్రామానికి చెందిన పి.గౌరీ చిలకలగెడ్డ కి చెందిన గిరిజనేతర రాలు అయినా రేఖ వెంకటిలక్ష్మి అనే టీడీపీ నాయకులు ఈ ఇద్దరు కలసి ప్రభుత్వ భూమిని ఆక్రమించేందుకు ప్రయత్నిస్తున్నారని వైసీపీ నాయకులు మండిపడుతున్నారు.టీడీపీ ప్రభుత్వం ఉందనే అలుసుతో వేరే గ్రామాలకు చెందిన వారు వచ్చి ఇక్కడ భూ కబ్జాలకు పాల్పడుతున్నారని,ఇదంతా అనంతగిరి మండల టీడీపీ మహిళా అధ్యక్షురాలి ప్రోత్సాహంతోనే జరుగుతోందని" వైసీపీ నాయకులు ఆరోపించారు.ప్రభుత్వ భూమిలో పార్టీ జెండాలు పెట్టి ప్రజలకు అధికారులకు మా వెనకతల పార్టీ పెద్ద నాయకులు ఉన్నారు అంటూ భయందోలనకు గురిచేస్తున్నారని,ఇలాంటి వారిపై అధికారులు దృష్టి సారించి చట్టపరంగా చర్యలు తీసుకోవాలని చిలకలగడ్డ గ్రామస్థులు,గిరిజనులు కోరుతున్నారు.అలాగే ఈ భూమిలో ఇల్ల పట్టాలు ఇచ్చిన అసలు లబ్ధిదారులైన గిరిజనులకు న్యాయం చేయాలని వారు డిమాండ్ చేశారు.

# జక్కంచర్ల సొసైటీ సేవలను రైతులు సద్వినియోగించుకోండి



**గూడూరు సెప్టెంబర్ 26(మీ వార్త ప్రతినిధి)** మండల పరిధిలోని జక్కంచర్ల ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం సేవలను రైతులు సద్వినియోగించుకోవాలని ఛైర్పర్సన్ మత్తి వెంకట సుబ్రహ్మణ్యం కోరారు. జక్కంచర్ల ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం సర్వసభ్య సమావేశం శుక్రవారం సొసైటీలో నిర్వహించారు. ఈ సందర్భంగా మత్తి వెంకట సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ సొసైటీ పరిధిలో 220 మందికి రుణాలు ఇచ్చామని వెల్లడించారు.92 మందికి దీర్ఘ కాలిక రుణాలు రూ.5 కోట్ల వరకు మంజూరు చేయడం జరిగిందని తెలిపారు. రూ.40 లక్షల మేర పంట రుణాలు ఇచ్చామని వివరించారు. తాము బాధ్యతలు స్వీకరించాక సొసైటీ టర్నోవర్ రూ 6 కోట్లు దాటిందన్నారు.ఈ సందర్భంగా సభ్యలకు ఛైర్పర్సన్ మత్తి వెంకట సుబ్రహ్మణ్యం సంఘ సభ్యలకు చిరు కానుకలు పంపిణీ చేసారు.కార్యక్రమంలో పర్సన్ లు మెర్సీ హేమలత, మొహమ్మద్ ఇనయతుల్లా, మాజీ సర్పంచ్ ఆత్మురి వెంకట రమణ, మొహమ్మద్ సలీం, సొసైటీ సీఈఓ జొన్నలగడ్డ భువనేశ్వరరావు పాల్గొన్నారు

# రైతులకు పంట నష్ట పరిహారం తక్షణమే అందించాలి

**ముంపు ప్రాంతాలను పరిశీలించిన వైసీపీ ఇంచార్జ్ వడ్డీ రఘురాం**



**తాడేపల్లిగూడెం, సెప్టెంబర్ 25 (మీ వార్త ప్రతినిధి)** తుఫాను ప్రభావంతో ఎర్రకాలువ ఉధృతంగా ప్రవహించడంతో తాడేపల్లిగూడెం నియోజకవర్గంలోని నందమూరు, మారంపల్లి, జగన్నాథపురం, దండగర్ర, మాధవరం గ్రామాల్లో పంట పొలాలు ముంపునకు గురయ్యాయి. ఈ నేపథ్యంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తాడేపల్లిగూడెం నియోజకవర్గ ఇంచార్జ్ వడ్డి రఘురాం నాయుడు ముంపు ప్రాంతాల్లో పర్యటించి, నీట మునిగిన పంటలను పరిశీలించి రైతులతో మాట్లాడారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ముంపుతో నష్టపోయిన రైతులను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని డిమాండ్ చేశారు. అధికారులు క్షేత్రస్థాయిలో పంట నష్టాన్ని అంచనా వేయాలని, రైతులకు రూ.25 వేల నుంచి రూ.30 వేల వరకు తక్షణ ఆర్థిక సహాయం అందించాలని కోరారు.గత వైసీపీ ప్రభుత్వ హయాంలో పంట నష్టం జరిగిన వెంటనే పరిహారం ఇచ్చామని, ఇప్పుడు మూడు పార్టీలు అధికారంలో ఉన్నందున మూడు రెట్లు పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు.నందమూరు అక్విడెక్ట్ వద్ద నీటి ప్రవాహానికి అడ్డంగా ఉన్న గుర్రపు డెక్కను తొలగించాలని, ప్రతి ఏటా పునరావృతమయ్యే ముంపునకు శాశ్వత పరిష్కారం చూపాలని, కేవలం ఫోటోలకు పరిమితం కాకుండా చర్యలు చేపట్టాలని అన్నారు. ఇరిగేషన్, రెవెన్యూ శాఖలు సమన్వయంతో పనిచేయాలని, యూరియా బ్లాక్ మార్కెట్ ను అరికట్టాలని కోరారు.రైతులకు న్యాయం చేయకపోతే వైసీపీ తరపున ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు.ఈ పర్యటనలో వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి తాళ్లూరి రామ్ కి జన్మదిన శుభాకాంక్షలు..!

**లింగం నాగేశ్వరరావు**



**పెదన సెప్టెంబర్ 26(మీ వార్త ప్రతినిధి)** జనసేన పార్టీ అధినేత, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ గారి ఆశయాలను ప్రజల్లోకి విరివిగా తీసుకుని వెళ్తూ పార్టీ బలోపేతం కోసం నిరంతరం కృషి చేస్తూ, ప్రజా సమస్యల పట్ల అవగాహన కలిగి వాటి పరిష్కారానికై అంకితభావంతో పని చేస్తూ, ప్రజల కోసం పరితపించే నాయకుడిగా పేరు తెచ్చుకున్న జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి తాళ్లూరి రామ్ కి పెదన నియోజకవర్గ జనసేన పార్టీ సీనియర్ నేత లింగం నాగేశ్వరరావు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా లింగం నాగేశ్వరరావు మాట్లాడుతూ, పార్టీ అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ కి అత్యంత విశ్వసనీయమైన సహచరుడిగా పేరు గాంచి, ఆయన ఆలోచనలను యధావిధిగా అమలు చేసే సామర్థ్యం కలిగిన వ్యక్తిగా తాళ్లూరి రామ్ ముద్ర పడ్డారని, పార్టీకి రామ్ అందిస్తున్న సేవలు ఎంతో అమూల్యమైనవని వివరించారు.అచిరకాలంలోనే తాళ్లూరి రామ్ పార్టీలో ఒక బలమైన నాయకుడిపాత్ర పోషిస్తున్నారని, ప్రతినిత్యం అధినేత పవన్ కళ్యాణ్ తో సంభాషించి ఆయన ప్రజల కోసం పని చేస్తూ ప్రజలతోనే ఉంటున్నారని లింగం నాగేశ్వరరావు కొనియాడారు.ఇలాంటి గొప్ప నాయకత్వ లక్షణాలు, ఉన్నత విద్య,జ్ఞాన సంపద మరియు ప్రజల్లోకి చొచ్చుకుని వెళ్ళే సుగుణాలు కలిగిన తాళ్లూరి రామ్ ని, పవన్ కళ్యాణ్ మరింత ప్రోత్సహించడం ఖాయమని, ఇప్పటికే ఈ విషయంలో పవన్ కళ్యాణ్ అన్ని రాజకీయ పార్టీల నేతలు కంటే భిన్నంగా నిలిచారని, పార్టీ కోసం కష్టపడిన వారిని అందలం ఎక్కించడం ఆయన గొప్పదనం అని లింగం నాగేశ్వరరావు పేర్కొని రానున్న రోజుల్లో తాళ్లూరి రామ్ ని పార్లమెంట్ సభ్యుడిగా చూడాలనేది తమ ఆకాంక్ష అని తెలిపారు.తాళ్లూరి రామ్ లాంటి విజ్ఞానవంతుడు దేశ రాజధాని పెద్దల సభలో ఉంటే రాష్ట్ర ప్రయోజనాల కొరకై అలుపెరుగని కృషి చేస్తారని, కేంద్రంలో ఉన్న పెద్దలతో మాట్లాడి రెండు తెలుగు రాష్ట్రాల అభివృద్ధికి నిధులు మంజూరు చేయించే బాధ్యత తీసుకుంటారని లింగం నాగేశ్వరరావు ఆశాభావం వ్యక్తం చేస్తూ ఈ మేరకు అధినేత పవన్ కళ్యాణ్ కి తాము అందరం విన్నవిస్తామని వివరించారు.

# తుఫాన్ సహాయక చర్యల్లో నిమగ్నమైన గొర్రెల శ్రీధర్

**బగ్గా వారి వీధిలో మోకాలు లోతు నీరు**



**తాడేపల్లిగూడెం, సెప్టెంబర్ 26 (మీ వార్త ప్రతినిధి)** తాడేపల్లిగూడెం పట్టణంలో మూడు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు 17వ వార్డు బగ్గా వారి వీధిలో రహదారులు మోకాలు లోతు నీటిలో మునిగిపోయాయి.వరద నీరు ఇళ్లల్లోకి చేరడంతో జనజీవనానికి తీవ్ర ఆటంకం వాటిల్లింది.ఇంతే కాకుండా 19,23,24 వార్డులలో వీధులు జలమయం కావడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.ఈ విషయాన్ని తెలుసుకున్న రాష్ట్ర తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఆర్గనైజేషన్ కార్యదర్శి, పట్టణం మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ గొర్రెల శ్రీధర్ స్వయంగా ఆ ప్రాంతాలను పరిశీలించారు.ఇళ్లలోకి నీరు చేరి నిలబడటానికి కూడా వీలులేని పరిస్థితిని చూసి, సొంత ఖర్చులతో నీటిని తోడే ఇంజన్లను, నీటి ప్రవాహం అడ్డు తొలగించేందుకు జేసీబీ లను ఏర్పాటు చేసి గండ్లు కొట్టించి వర్షపు నీరు బయటకు వెళ్లేలా దగ్గరుండి చేయించారు. బాధితులను సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని సూచించారు. అంతటితో ఆగకుండా సంబందిత అధికారులకు ఫోన్ చేసి బాధితులకు ప్రభుత్వం తరపున సహాయక చర్యలు అందించాలని శ్రీధర్ కోరారు.

## అగ్రి జెనటిక్స్ కంపెనీ మిర్చి విత్తనాలతో నష్టపోయిన రైతులకు నష్టపరిహారం



**వేలేరుపాడు సెప్టెంబర్26 (మి వార్తా ప్రతినిధి)** వేలేరుపాడు మండలంలోని చిగురుమామిడి, నార్లవరం గ్రామాలకు చెందిన మిర్చి రైతులు గత సంవత్సరం అగ్రి జెనటిక్స్ కంపెనీకి చెందిన మిర్చి విత్తనాలు సాగు చేసి నష్టపోయారు. ఈ నేపథ్యంలో బాధిత రైతులకు నష్టపరిహారం అందించేందుకు ఎమ్మెల్యే చిర్రి బాలరాజు చొరవ తీసుకున్నారు.ఈ క్రమంలో 29 మంది రైతులకు చెందిన 47 ఎకరాల మిర్చి పంటకు సంబంధించి సుమారు రూ.14 లక్షల నష్టపరిహారాన్ని, కంపెనీ సహకారంతో శనివారం పోలవరం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే చిర్రి బాలరాజు బాధిత రైతులకు చెక్కుల రూపంలో అందజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే చిర్రి బాలరాజు మాట్లాడుతూ, రైతులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా వారి సమస్యలను పరిష్కరించేందుకు తన వంతు కృషి చేస్తానని తెలిపారు. రైతులు నష్టపోయిన సమయంలో వారికి అండగా నిలిచి, న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవడం తన బాధ్యతగా భావిస్తున్నానని పేర్కొన్నారు. రైతుల సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారి గంగాధరం, కూటమి నాయకులు మేచినేని సంజయ్, శివరాం, భాను తదితరులు పాల్గొన్నారు.

## చీపురు పట్టిన మున్సిపల్ కమిషనర్ ఏసుబాబు



**తాడేపల్లిగూడెం, సెప్టెంబర్ 26 (మీ వార్త ప్రతినిధి)** తాడేపల్లిగూడెం పురపాలక సంఘం ఆధ్వర్యంలో స్వచ్ఛత హి సేవ - 2026 కార్యక్రమంలో భాగంగా శుక్రవారం 13వ వార్డు శివాలయం వద్ద కాలువ గట్టు వద్ద శుభ్రతా కార్యక్రమం నిర్వహించారు.మున్సిపల్ కమిషనర్ ఎం. యేసుబాబు స్వయంగా పాల్గొని చీపురు పట్టి శుభ్రం చేశారు. శానిటేషన్ సిబ్బంది, సచివాలయ సిబ్బందితో కలిసి కాలువ గట్టు పరిసరాల్లో పేరుకుపోయిన చెత్త, ప్లాస్టిక్ వ్యర్థాలు, పిచ్చి మొక్కలను తొలగించారు. దీంతో ఆయన ప్రజలకు ఆదర్శంగా నిలిచారు.కమిషనర్ మాట్లాడుతూ ఆలయ పరిసరాలు, కాలువ గట్టు పరిశుభ్రంగా ఉంటేనే భక్తులకు, ప్రజలకు ఆహ్లాదకర వాతావరణం ఉంటుందని, ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని ఆయన సూచించారు. ప్రజలు కాలువలో చెత్త వేయవద్దని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో పురపాలక అధికారులు, సిబ్బంది, వార్డు సచివాలయ సిబ్బంది, శానిటేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

## నకిలీ మిర్చి విత్తనాలతో నష్టపోయిన రైతులకు నష్టపరిహారం.

పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు..



**జీలుగుమిల్లి. (మీ వార్త ప్రతినిధి)** వేలేరుపాడు మండలంలోని చిగురుమామిడి, నార్లవరం గ్రామాలకు చెందిన మిర్చి రైతులు గత సంవత్సరం అగ్రి జెనటిక్స్ కంపెనీకి చెందిన మిర్చి విత్తనాలు సాగు చేసి నష్టపోయారు. ఈ నేపథ్యంలో బాధిత రైతులకు నష్టపరిహారం అందించేందుకు ఎమ్మెల్యే చిర్రి బాలరాజు చొరవ తీసుకున్నారు.ఈ క్రమంలో 29 మంది రైతులకు చెందిన 47 ఎకరాల మిర్చి పంటకు సంబంధించి సుమారు రూ.14 లక్షల నష్టపరిహారాన్ని, కంపెనీ సహకారంతో శనివారం పోలవరం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే చిర్రి బాలరాజు బాధిత రైతులకు చెక్కుల రూపంలో అందజేశారు.
ఈ సందర్భంగా ఎమ్మెల్యే చిర్రి బాలరాజు మాట్లాడుతూ, రైతులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా వారి సమస్యలను పరిష్కరించేందుకు తన వంతు కృషి చేస్తానని తెలిపారు. రైతులు నష్టపోయిన సమయంలో వారికి అండగా నిలిచి, న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవడం తన బాధ్యతగా భావిస్తున్నానని పేర్కొన్నారు. రైతుల సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారి గంగాధరం, కూటమి నాయకులు మేచినేని సంజయ్, శివరాం, భాను తదితరులు పాల్గొన్నారు..

## స్థానిక సంస్థల ఎన్నికలపై కూటమి నేతల కీలక సమావేశం



**ఒంగోలు : సెప్టెంబర్ 27 (మీ వార్త జిల్లా ప్రతినిధి)** స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి కూటమి శ్రేణులను సమన్వయం చేసేందుకు ఒంగోలులోని మాగుంట కార్యాలయంలో శనివారం కీలక సమావేశం నిర్వహించారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, ప్రకాశం జిల్లా ఎన్నికల పరిశీలకుడు, శాసనమండలి సభ్యుడు బీటీ నాయుడు, ఒంగోలు పార్లమెంట్ సభ్యుడు మాగుంట శ్రీనివాసులురెడ్డి సమావేశంలో పాల్గొన్నారు. సమావేశంలో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణ, కూటమి భాగస్వామ్య పక్షాల మధ్య సమన్వయం, క్షేత్రస్థాయిలో పార్టీ శ్రేణుల సన్నద్ధత తదితర అంశాలపై చర్చించినట్లు తెలిపారు. గ్రామ, మండల స్థాయిలో కూటమి నాయకులు, కార్యకర్తల మధ్య సమన్వయంతో ముందుకు సాగాల్సిన అవసరంపై నేతలు దిశానిర్దేశం చేసినట్లు సమాచారం. జిల్లాలో స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని నియోజకవర్గాల వారీగా రాజకీయ పరిస్థితులు, స్థానిక నాయకుల సమన్వయం, ఎన్నికల కార్యాచరణపై కూడా చర్చ జరిగినట్లు తెలుస్తోంది. సమావేశంలో జిల్లా శాసనసభ్యులు, కూటమి నాయకులు, ముఖ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

## అనంతగిరి మండల ప్రత్యేక అధికారిగా డాక్టర్ స్వామి నాయుడు బాధ్యతల స్వీకరణ.



**అనంతగిరి,సెప్టెంబర్ 26 ( మీ వార్త )** అనంతగిరి మండల ప్రజా పరిషత్ అధ్యక్షుని పదవీకాలం ముగియడంతో, ప్రభుత్వ ఆదేశాల ప్రకారం అల్లూరి సీతారామరాజు జిల్లా సమగ్ర శిక్ష ఏపీసి డాక్టర్ స్వామి నాయుడు శనివారం మండల ప్రత్యేక అధికారిగా బాధ్యతలు స్వీకరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..మండలంలోని అన్ని పంచాయితీలను సమన్వయం చేసుకుంటూ విద్యా, వైద్య, ఆరోగ్య రంగాల మెరుగుదలకు, మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తూ మండలాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తానని చెప్పారు.ఈ కార్యక్రమంలో ఈఓపిఆర్డీఓ నర్సింగరావు,మండల విద్యాధికారులు కిల్లో బాలాజీ,బి.బి. నాగేశ్వరరావు,ప్రధాన ఉపాధ్యాయులు వంగపండు అప్పలనాయుడు, ఎంఆర్‌సి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## పెంటపాడులో ఘనంగా పండిట్ దీన్ దయాల్ శర్మ జన్మదిన వేడుకలు



**పెంటపాడు సెప్టెంబర్ 26 (మీ వార్త ప్రతినిధి)** మండలంలోని పెంటపాడు బిజెపి కార్యాలయంలో పండిట్ దీన్ దయాల్ శర్మ జన్మదిన వేడుకలు పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు కొత్తపల్లి నాగ సత్యనారాయణ (శేషు) ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.శేషు దీన్ దయాల్ చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. ఆయన మాట్లాడుతూ పండిట్ దీన్ దయాల్ శర్మ ఒక తత్వవేత్త, రాజకీయ నాయకుడు, రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ (ఆర్ఎస్ఎస్), ప్రచారక్ గా, భారతీయ జనసంఘ పార్టీ ప్రధాన కార్యదర్శిగా పనిచేశారని తెలిపారు. ఏకాత్మ మానవవాదంతో భారతీయ సంస్కృతి, ధర్మం ఆధారంగా దేశాన్ని నిర్మించాలని చెప్పారు. నేటికీ ఇదే బిజెపికి మూల సిద్ధాంతం అని పేర్కొన్నారు. ప్రభుత్వ పథకాలు సమాజంలో అట్టడుగున ఉన్న చివరి వ్యక్తికి చేరినప్పుడే దేశం అభివృద్ధి చెందినట్లు అని చెప్పారన్నారు. ప్రధాని మోడీ ప్రభుత్వం చేపట్టిన అనేక పథకాలలో జన్ ధన్, దీన్ దయాల్ ఉపాధ్యాయ గ్రామీణ కౌశల్య యోజన, దీన్ దయాల్ అంత్యోదయ యోజన ఇవన్నీ ఆయన స్ఫూర్తితోనే ప్రధాని మోడీ ప్రవేశపెట్టారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఏపీ ఎన్ఐటీ విస్తరణకు భూములు పరిశీలించిన జాయింట్ కలెక్టర్ కల్పశ్రీ



తాడేపల్లిగూడెం, సెప్టెంబర్ 26 (మీ వార్త ప్రతినిధి) తాడేపల్లిగూడెంలోని ఏపీ ఎన్ఐటీ విస్తరణకు అవసరమైన భూములను జిల్లా జాయింట్ కలెక్టర్ కల్పశ్రీ కె.ఆర్. శనివారం పరిశీలించారు.రెవెన్యూ, ఎన్ఐటీ అధికారులతో కలిసి జాయింట్ ఇన్‌స్పెక్షన్ నిర్వహించారు. ఎన్ఐటీకి పడమర వైపున ఉన్న భూములతో పాటు, గాంధీబొమ్మ సెంటర్ నుండి ఎన్ఐటీకి వెళ్లే దారిలో కొండాలమ్మ గుడి, ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల సమీపంలోని భూములను సందర్శించారు.ఆర్డీవో ఎం. సూర్యారావు, తహసీల్దార్ ఎం. సునీల్ కుమార్ మ్యాప్ చూపించి వివరాలు అందించగా, ఎన్ఐటీ రిజిస్ట్రార్ డాక్టర్ పి. దినేష్ శంకర్ రెడ్డి ప్రస్తుత వసతుల గురించి వివరించారు. ఈ సందర్భంగా జేసీ కల్పశ్రీ మాట్లాడుతూ ఎన్ఐటీ విస్తరణకు 50 ఎకరాల భూమి కావాలని కోరారని, ప్రస్తుతం అందుబాటులో ఉన్న 25 ఎకరాలను పరిశీలించామని, భూములు కేటాయించే అవకాశాలపై నివేదికను ప్రభుత్వానికి పంపిస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో గ్రామ రెవెన్యూ అధికారులు, సర్వేయర్లు పాల్గొన్నారు.

## ఎంఈఓకు యూటీఎఫ్ వినతి.


ఉపాధ్యాయుల సర్వీస్ బుక్కులు అప్‌డేట్ చేయాలి.

పాఠశాలలకు నిధులు,కోడిగుడ్లు,చిక్కీలు సకాలంలో అందించాలని డిమాండ్.



**అనంతగిరి,సెప్టెంబరు 26 ( మీ వార్త )** అనంతగిరి మండలంలోని ప్రభుత్వ పాఠశాలలు, ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరుతూ యునైటెడ్ టీచర్స్ ఫెడరేషన్ (యూటీఎఫ్) ఆధ్వర్యంలో శనివారం మండల విద్యాశాఖాధికారి కె. బాలాజి వినతిపత్రం అందజేశారు.యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి పి.దేముడు ఆధ్వర్యంలో మండల నాయకులు ఎంఈఓను కలిసి విద్యాశాఖ పరిధిలోని పలు సమస్యలపై ప్రాతినిధ్యం వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలోని మండల పరిషత్ ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయుల సర్వీసు పుస్తకాలను వెంటనే అప్‌డేట్ చేయాలని కోరారు.అదేవిధంగా పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం కింద విద్యార్థులకు అందించే కోడిగుడ్లు,చిక్కీలను ఎటువంటి ఆలస్యం లేకుండా సకాలంలో సరఫరా చేయాలని డిమాండ్ చేశారు.పాఠశాలల నిర్వహణకు సంబంధించిన నిధులను త్వరితగతిన మంజూరు చేసి విద్యావ్యవస్థ బలోపేతానికి అధికారులు చొరవ చూపాలని విజ్ఞప్తి చేశారు.ఈ సమస్యలపై సానుకూలంగా స్పందించి, త్వరగా పరిష్కరించాలని వారు కోరారు.ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ అనంతగిరి మండల అధ్యక్షుడు జన్ని దేముడు,ప్రధాన కార్యదర్శి ఎస్.గంగరాజు,గౌరవ అధ్యక్షుడు బీఎస్ఎన్ఎల్ పడాల్,కోశాధికారి బి. విజయకుమార్,మాజీ ప్రధాన కార్యదర్శి బిడ్డి సింహాచలం,కార్యదర్శి పంచాడి రామచందర్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రెస్ క్లబ్ నూతన నూతన కార్యవర్గానికి అభినందనలు తెలిపిన ఎమ్మెల్యే జ్యోతుల



**గోకవరం, సెప్టెంబర్ 26 ( మీ వార్త విలేఖరి ):** ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య మీడియా పాత్ర కీలకమని ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ పేర్కొన్నారు. ప్రెస్ క్లబ్ నూతన కార్యవర్గానికి ఆయన అభినందనలు తెలిపారు.సభ్యులందరూ స్నేహపూర్వకమైన వాతావరణంలో ముందుకు సాగాలని గోకవరం ప్రెస్ క్లబ్ సభ్యులకు ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ సూచించారు. ప్రెస్ క్లబ్ నూతన కార్యవర్గం ఏర్పడిన నేపథ్యంలో శనివారం ప్రెస్ క్లబ్ అధ్యక్షులు కొంగరపు రాజు, ప్రధాన కార్యదర్శి కర్రి శివరామకృష్ణ అధ్యక్షతన సభ్యులు ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా జగ్గంపేటలో అయన స్వగృహం లో కలిశారు.ఇటీవల నూతనంగా ఎన్నుకోబడిన కార్యవర్గానికి ఆయన శుభాకాంక్షలు అందజేశారు . గోకవరం మండల పెద్దలతో ప్రెస్ క్లబ్ అభివృద్ధికి పలు వినతులను ఎమ్మెల్యేకి అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నెహ్రూ మాట్లాడుతూ జర్నలిజం వృత్తిలో ప్రతి ఒక్కరు రాణించాలని, నియోజవర్గ స్థాయిలో ఉన్న రిపోర్టర్లు జిల్లా స్థాయికి ఎదగాలని ఆయన ఆకాంక్షించారు. నాయకులు, మరియు ప్రెస్ క్లబ్ సభ్యులు అభ్యర్థుల మేరకు ప్రెస్ క్లబ్ అభివృద్ధికి సహకరిస్తానని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపి కార్యదర్శి కన్నబాబు, జగ్గంపేట మార్కెట్ కమిటీ చైర్మన్ అడపా భరత్ కుమార్,టీడీపీ రాష్ట్ర నాయకులు ఎస్ వి ఎస్ అప్పలరాజు, రాష్ట్ర ఆర్య వైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ కొత్త కొండబాబు,మాజీ సొసైటీ చైర్మన్ దాసరి తమ్మన్న దొర, జగ్గంపేట మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ జనపరెడ్డి బాబు,మాజీ జడ్పీటీసీ పాలూరి బోసుబాబు, తంటికొండ దేవస్థానం చైర్మన్ బద్దిరెడ్డి అచ్చన్న దొర, మండల టీడీపీ నాయకులు దాసరి సీతారామకృష్ణ, మండిగ గంగాధర్,నాగం వెంకటపతి, బొట్టా రామకృష్ణ,చింతల నాగు తదితరులు పాల్గొన్నారు.

## రాజు గారి దివాణంలో వినాయక చవితి ఉత్సవ కమిటీవారికి రూ.5 వేలు విరాళం ఇచ్చిన డాక్టర్ చల్లా, గౌతు నాగు గారి ముద్దుల మనవడు జస్విక్ ప్రణయ్.



**అమలాపురం, మీ వార్త ప్రతినిధి, సెప్టెంబర్,** 26 గణపతి నవరాత్రుల సందర్భంగా మండల కేంద్రం ఆలమూరు లోని రాజు గారి దివాణంలో వినాయక చవితి ఉత్సవ కమిటీవారికి ఉత్సవాల అనంతరం జరిగే అన్నసమారాధనకు రూ.5 వేలు విరాళం ఇచ్చిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఐక్య కాపునాడు ట్రెజరర్,డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కాపు సంఘం అధ్యక్షులు,ప్రముఖ వ్యాపారవేత్త, జాతీయ సేవా పురస్కార్ అవార్డు గ్రహీత డాక్టర్ చల్లా ప్రభాకర్ రావు, గౌతు సుబ్రహ్మణ్యం(నాగు) గారి ముద్దుల మనవడు జస్విక్ ప్రణయ్.ఈ కార్యక్రమంలో జి సూర్యనారాయణ,ఎస్ సతీష్,ఎస్ దుర్గారావు,డి వాసు,ఎల్ కార్తీక్,బి శ్యామ్,కె దేవ,వై యశ్వంత్,పి వెంకన్న,ఎం శేషు,సిహెచ్ శివశంకర్,ఎం భవానిశంకర్,ఎన్ రామ్ చరణ్,వి హరి,ఎస్ ధనుష్,ఎం శ్యామ్,ఎస్ సాయి,ఎల్ కార్తీక్,ఎల్ సందీప్,ఎస్ వినయ్ తదితరులు పాల్గొన్నారు.

## సంతాన వేణుగోపాలస్వామి ఆలయంలో హనుమత్--సుదర్శన--లక్ష్మీ నరసింహ అర్చన, హోమం



**మచిలీపట్నం, సెప్టెంబర్ 26:(మీ వార్త ప్రతినిధి)** విశ్వ హిందూ పరిషత్ సభ్యులు సహకారంతో మచిలీపట్నంలోని సర్కిల్లపేట సంతాన వేణుగోపాలస్వామి ఆలయంలో శనివారం ఉదయం 10 గంటలకు హనుమత్ సుదర్శన లక్ష్మీ నరసింహ అర్చన మరియు హోమ కార్యక్రమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.మొదట బందర్ కోటలో నిర్వహించాల్సిన ఈ యజ్ఞ కార్యక్రమం, అక్కడి అర్చకుల నిరాకరణ కారణంగా సంతాన వేణుగోపాలస్వామి ఆలయానికి మార్చబడింది. అనంతరం ఆలయ ధర్మకర్తలు మరియు విశ్వ హిందూ పరిషత్ ప్రతినిధుల సమన్వయంతో కార్యక్రమాన్ని సక్రమంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త మరియు విశ్వ హిందూ పరిషత్ జిల్లా ప్రముఖ్ శ్రీ జొన్నలగడ్డ సుబ్రహ్మణ్యం, శ్రీ ప్రసన్న ఆంజనేయులు, శ్రీమతి సుభాషిణి, ఆలయ అర్చకులు శ్రీ శేషు, శ్రీ తమ్మన సత్యరాజు, శ్రీ వెచ్చగా సత్య గంగరాజు, శ్రీ కోట శ్రీకాంత్ తదితరులు పాల్గొని హోమ కార్యక్రమాన్ని నిర్వహించారు.సుమారు 45 మంది భక్తులు కార్యక్రమంలో పాల్గొని స్వామివారి అర్చన, హోమంలో భక్తిశ్రద్ధలతో పాల్గొన్నారు. లోకకల్యాణం, ధర్మరక్షణ, సమాజ శ్రేయస్సు కోసం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.ఈ సందర్భంగా వి హెచ్ పి జిల్లా అధ్యక్షులు డా. బూరగడ్డ శ్రీనాథ్ కార్యక్రమ నిర్వాహకులను అభినందించారు. భక్తిశ్రద్ధలతో కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేసిన 45 మంది భక్తులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఆలయ ధార్మిక కార్యక్రమాలను భక్తుల భాగస్వామ్యంతో నిరంతరం నిర్వహించాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు.

## నీట మునిగిన జట్లపాలెం జడ్పీ హైస్కూల్ ప్రాంగణం

సకాలంలో స్పందించిన పంచాయతీ కార్యదర్శి గంగాధర్






**పెంటపాడు, సెప్టెంబర్ 26 (మీ వార్త ప్రతినిధి)** పెంటపాడు మండలం జట్లపాలెం గ్రామంలోని జడ్పీ హైస్కూల్ ప్రాంగణం గత నాలుగు రోజులుగా కురిసిన భారీ వర్షాలకు నీట మునిగింది. వర్షాల కారణంగా రెండు రోజులు సెలవుల అనంతరం శనివారం పాఠశాలకు వచ్చిన విద్యార్థులు, ఉపాధ్యాయులు ప్రాంగణమంతా నీరు నిలిచి ఉండటం చూసి ఆందోళన చెందారు.వెంటనే విద్యార్థులు స్థానిక పంచాయతీ కార్యాలయానికి వెళ్లి పరిస్థితిని వివరించారు. దీనిపై స్పందించిన పంచాయతీ కార్యదర్శి వి. గంగాధర్ తన సిబ్బందితో హుటాహుటిన పాఠశాలకు చేరుకుని మోటార్ల సహాయంతో నీటిని తొలగించి విద్యార్థులు, ఉపాధ్యాయులకు ఊరట కలిగించారు.ఈ సందర్భంగా కార్యదర్శి గంగాధర్ మాట్లాడుతూ పాఠశాల నుండి నీరు బయటకు వెళ్లేందుకు ఉన్న కచ్చా డ్రెయిన్ పూడికతో మూసుకుపోవడం వల్లే నీరు నిలిచిపోయిందని, ప్రాంగణంలో నీరు నిలవకుండా సిమెంట్ తూములు వేసేందుకు సచివాలయ ఇంజనీర్ అసిస్టెంట్ ప్రశాంత్ రెడ్డితో ఎస్టిమేట్ వేయిస్తున్నామని తెలిపారు.

# ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల విచారణ వేగవంతం చేయాలి

**బాధితులకు సత్వర పరిహారం అందించాలి: మంత్రి "డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి"**

**ఒంగోలు : సెప్టెంబర్ 27(మీ వార్త జిల్లా ప్రతినిధి)** ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల దర్యాప్తును వేగవంతం చేసి, బాధితులకు సత్వర న్యాయం, పరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డా. డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి అధికారులను ఆదేశించారు. దాడులు, దౌర్జన్యాలకు పాల్పడిన వారిపై చట్ట ప్రకారం త్వరితగతిన చర్యలు తీసుకునేలా కేసుల విచారణను సమన్వయంతో ముందుకు తీసుకెళ్లాలని సూచించారు.
ప్రకాశం భవన్‌లో జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు అధ్యక్షతన నిర్వహించిన ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సమావేశానికి మంత్రి హాజరై మాట్లాడారు. జిల్లాలో ఈ ఏడాది 58 ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదయ్యాయని, వాటిలో 9 కేసులు ప్రస్తుతం కోర్టుల్లో విచారణలో ఉన్నాయని తెలిపారు. మిగిలిన కేసుల్లో దర్యాప్తు, ఛార్జ్‌షీట్ దాఖలు ప్రక్రియను వేగవంతం చేయాలని పోలీసు అధికారులను ఆదేశించారు.

**విద్యార్థుల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు**

ఎస్సీ, ఎస్టీ విద్యార్థుల విద్యాభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందని మంత్రి తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 600 మంది ఇంటర్మీడియట్ విద్యార్థులకు ఐఐటీ, నీట్ ప్రవేశ పరీక్షలను లక్ష్యంగా చేసుకుని కార్పొరేట్ సంస్థల ద్వారా ప్రత్యేక బోధన అందిస్తున్నట్లు వివరించారు. ఒంగోలులో అంబేద్కర్ స్టడీ సర్కిల్‌ను అందుబాటులోకి తీసుకురావడంతో పాటు నైపుణ్యాభివృద్ధి, యూపీఎస్సీ వంటి పోటీ పరీక్షలు, ఉపాధి అవకాశాల కోసం అవసరమైన శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.



**నెల రోజుల్లో స్మశాన స్థలాల సమస్య పరిష్కారం**

ఎస్సీ, ఎస్టీ వర్గాల సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు కలెక్టర్ పి.రాజాబాబు తెలిపారు. స్మశాన వాటికలకు స్థలాలు లేని గ్రామాలను గుర్తించి, అందుబాటులో ఉన్న ప్రభుత్వ భూమిని నెల రోజుల్లోగా కేటాయించేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఎస్సీ, ఎస్టీల సమస్యలను నేరుగా తెలుసుకుని పరిష్కరించేందుకు ప్రతి నెల మూడో సోమవారం ప్రత్యేక గ్రీవెన్స్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వివరించారు.

**అట్రాసిటీ కేసుల దర్యాప్తుపై ప్రత్యేక దృష్టి**

జిల్లా ఎస్పీ వి.హర్షవర్ధన్ రాజు మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల దర్యాప్తును త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. కేసుల దర్యాప్తు, శిక్షల విషయంలో ప్రకాశం జిల్లా రాష్ట్రంలోని టాప్ 5 జిల్లాల్లో ఉందని పేర్కొన్నారు. బాధితులకు చట్టపరమైన రక్షణతో పాటు ప్రభుత్వ పరంగా అందాల్సిన పరిహారం సకాలంలో అందేలా సమన్వయంతో పనిచేస్తున్నట్లు వివరించారు.
సమావేశంలో కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు, వివిధ శాఖల జిల్లా అధికారులు, పోలీసు అధికారులు, ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# మండపర్తి గ్రామంలో తాగునీటి ఎద్దడి నివారించండి.

**అధికారుల నిర్లక్ష్యంపై గ్రామ మహిళలు ఆగ్రహం.**

**బిందె నీళ్లు కోసం గంటల తరబడి పడి కాపులు.**

**అనంతగిరి,సెప్టెంబర్ 26 ( మీ వార్త )** అల్లూరి జిల్లా అనంతగిరి మండలం కాశీపట్నం పంచాయితీ మండపర్తి గ్రామంలో తాగునీటి ఎద్దడి నివారించాలని గ్రామ మహిళలు ఆగ్రహంతో మండిపడుతున్నారు.గ్రామంలో సుమారు 79 కుటుంబాలతో 800 మంది జీవనం గడుపుతూన్నారు,గత కొంత కాలం నుంచి గుక్కెడు మంచి నీటి కోసం అల్లాడిపోతున్నారు.గ్రామంలో ఉన్న తాగునీటి కొళాయి మరమ్మత్తులకు గురవడంతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.గ్రామంలో ఉన్న మంచినీటి ట్యాంకు కాలం చెల్లి రంధ్రాలు ఏర్పడి నీటి నిలువ లేకపోవడంతో చేసేదేమీ లేక గ్రామనికి 3 కిలోమీటర్ల దూరంలో ఉన్న పై కప్పులేని నీళ్ల కుండీలో నుంచి కలుషితమైన ఊట నీరు గత పది సంవత్సరం క్రితం ఏర్పాటు చేసిన గ్రావిటీ పైపు ద్వారా వచ్చే కొద్దిపాటి నీటిని బిందె నీళ్ల కోసం గంటల తరబడి ప డిగాపు కాయ వలసిన పరిస్థితి ఏర్పడుతుందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు.



**అధికారుల నిర్లక్ష్యంపై ఆగ్రహం**

గ్రామంలో నెలకొంటున్న మంచినీటి సమస్యపై స్థానిక పంచాయతీ సెక్రెటరీ పూర్తిగా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని గ్రామస్తులు మండిపడుతున్నారు.మంచినీటి కొళాయి నీటి ట్యాంకు పాడై ఏళ్లు గడుస్తున్నా దీనిపై పలుమార్లు పంచాయితీ సెక్రెటరీ ఫిర్యాదు చేసిన సమస్యపై స్పందించకపోవడం అత్యంత బాధకారమని గ్రామ మహిళలు ధ్వజమెత్తారు.ప్రభుత్వాలు నాయకులు అధికారులు మారుతున్నా మా నీటి కష్టాలు తీరడం లేదన్నారు,ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి గ్రామంలో మంచినీటి సమస్య తీర్చాలని టి ఆర్ హ్యూమన్ రైట్స్ యాంటీ కరప్షన్ అసోసియేషన్ హ్యూమన్ వింగ్ చైర్మన్ కే రాధమ్మ,హ్యూమన్ వింగ్ సెక్రెటరీ జి అశ్విని,గ్రామస్తులు సిహెచ్ సన్యాసిరావు,బి కొండబాబు,జి ఎర్రిబాబు,ఎం సన్యాసమ్మ,జి సత్యవతి,తదితరులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు.

# రుద్రం కోటలో ఉన్న అంగన్ వాడి కేంద్రం లో అంగన్ వాడి ఉత్సవం కార్యక్రమం

**వెలేరుపాడు సెప్టెంబర్ 26 (మి వార్తా ప్రతినిధి)** రుద్రం కోటలో శనివారం కుకునూరు ప్రాజెక్టు, తట్కూరు గోమ్ము సెక్టర్ 2 లో ఉన్న , రుద్రం కోటాలో బీసీ కాలనిలో కోడ్ నెంబర్ 0503324 గల అంగన్ వాడి కేంద్రం లో అంగన్ వాడి ఉత్సవం కార్యక్రమం జరిగినది. ఈ కార్యక్రమం లో కూటమి నాయకులు తెలుగుదేశం పార్టీ నుండికోటూరి. సత్యనారాయణ, ముదిగొండ. రామకృష్ణ బీజేపీ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి సారె. బాబ్జి,బీజేపీ వెలేరుపాడు మండల మహిళా మోర్చా నాయకులు సారె. నాగమణి ముఖ్య అతిధిగా పాల్గొవటం జరిగినది. ఈ సందర్బంగా బీజేపీ మహిళా మోర్చా నాయకురాలు సారె. నాగమణి మాటాడుతూ సేవా సంకల్ప అభియాన్ 25 సంవత్సరం లు సేవా ప్రస్థానం కిందపోషణ సంకల్ప అభియాన్ పోషణ మాస ఉత్సవం లో భాగంగా ఈ సందర్బంగా ఆమె మాట్లాడుతూ దేశానికి నేటి బావి తరాల పౌరులు ఎంతో అవసరం అని, ఈ అంగన్ వాడి కేంద్రాలు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టినదని , తల్లి గర్భిణీ దాల్చిన నుండి తల్లి బిడ్డ కు కావలసిన పోషక విలువలు ఉన్న ఆహారం ఈ అంగన్ వాడి కేంద్రం ద్వారా వారికి అందుతుంది అని,వారు అప్పుడే మంచి ఆరోగ్యావంతులుగా ఉంటారు అని తెలిపారు. బాలసంజీవిని కిట్టు ద్వారా అనగా( బెల్లం, రాగి పిండి, గోధుమ పిండి, ఖర్జురమ్, పల్లి చెక్క ), పాలు, గుడ్లు, పప్పు, నూనె అలాగే బాలామృతం పొడి ఇవన్నీ రోజు ఆహారం లో తీసుకోవటం తో చిన్నారులకు, తల్లులుకు మంచి ఆరోగ్యం గా ఉంటారు అని అంగన్ వాడి కేంద్రంకు వొచ్చిన గర్భిణీలకు, అంగన్ వాడి చిన్నారులకు అర్థం అయ్యేలా వివరించారు.నేటి బాలలే రేపటి పౌరులు అని ఈ పౌరులు ఆరోగ్యాంగా ఉండాలి అని మన దేశ ప్రధాని నరేంద్ర మోదీ అంగన్ వాడి కేంద్రానికి ఎంతో ప్రాముఖ్యత నిస్తున్నారని తెలపటం జరిగింది. అందుకనే ప్రతీ సంవత్సరం సెప్టెంబర్ 25వ తారీఖునుండి అక్టోబర్ 7 వ తారీకు వరకు ఈ అంగన్ వాడి ఉత్సవాలు జరుగుతాయి అని ఆమె అన్నారు.నుండి ఈ కార్యక్రమం లో సచివాలయం సిబ్బంది ఎం.జయరాజు డిజిటల్ అసిస్టెంట్,ఈ. అనిత వెల్ఫర్ అసిస్టెంట్ , ఏ ఎన్ ఎం కె. బేబీ రాణి,అంగన్ వాడి టీచర్ కుంజా.శ్రీకాంత, కుషిదా బేగం హెల్పేర్,ఆశ సిబ్బంది కొక్కెరపాటి.రిబ్కా, గర్భిణీలు,కొవ్వాల. యామిని, బొర్రా. కృష్ణ వేణి, యాస. ఉమాదేవి. తల్లులు, గడ్డం. త్రివేణి, తుంగా . అలివేలు, గుండారపు. విజయ, నాగోదు. రజని, కొవ్వాల. కౌసల్య, గడ్డం. సుబ్బమ్మ, కొవ్వాల. రమాదేవి, తుంగా. ఏసమ్మ, తదితరులు పాల్గున్నారు.




# ఖైరతాబాద్ చుట్టూ రాజకీయాలు

**హైదరాబాద్ :** తెలంగాణ రాజకీయాలకు ఇప్పుడు ఖైరతాబాద్ నియోజకవర్గం కేంద్ర బిందువుగా మారింది. ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ అనర్హత వేటు పడడంతో అక్కడ ఉపఎన్నిక అనివార్యమైంది. ఇది అధికార కాంగ్రెస్ పార్టీకి అత్యంత కీలకంగా మారింది. జీహెచ్ఎంసీ పరిధిలో పట్టు సాధించేందుకు కాంగ్రెస్ పార్టీకి ఇది సరికొత్త రాజకీయ అవకాశాన్ని ఇస్తోంది.2023 శాసనసభ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థిగా గెలిచిన దానం నాగేందర్, ఆ తర్వాత రాజకీయ పరిణామాల నేపథ్యంలో కాంగ్రెస్ గూటికి చేరారు. అయితే ఫిరాయింపుల చట్టం వల్ల ఆయన తన ఎమ్మెల్యే పదవిని కోల్పోవాల్సి వచ్చింది. ఇప్పుడు ఈ నియోజకవర్గంలో జరగబోయే ఉపఎన్నిక కేవలం ఒక స్థానానికి పరిమితం కాలేదు. గ్రేటర్ హైదరాబాద్ ప్రాంతంలో పార్టీ సంస్థాగత బలాన్ని పెంచుకోవడానికి, అలాగే బీఆర్ఎస్ బలమైన పునాదులను దెబ్బతీయడానికి కాంగ్రెస్‌కు ఇది పెద్ద అవకాశంగా చెప్పవచ్చు.ఖైరతాబాద్ ఉపఎన్నికలో దానం నాగేందర్ మరోసారి పోటీ చేయడానికి ఆసక్తి చూపుతున్నారు. ఒకవేళ ఆయన గెలిస్తే, కేబినెట్ విస్తరణలో ఆయనకు మంత్రి పదవి దక్కే అవకాశాలు ఉన్నాయన్న చర్చ జోరుగా సాగుతోంది. ఇది కాంగ్రెస్ పార్టీకి రెండు ప్రయోజనాలను కల్పించే అవకాశం ఉంది. ఒకటి.. హైదరాబాద్ నగరానికి రాష్ట్ర మంత్రివర్గంలో బలమైన ప్రాతినిధ్యం లభిస్తుంది. రెండు.. మున్నూరు కాపు సామాజిక వర్గానికి మంత్రివర్గంలో సముచిత స్థానం కల్పించినట్లవుతుంది. ప్రస్తుతం కేబినెట్లో ఈ సామాజిక వర్గానికి మంత్రి పదవి లేదు. కొండా సురేఖ తొలగింపు తర్వాత తలెత్తిన రాజకీయ శూన్యతను పూడ్చడానికి ఈ పరిణామం ఉపయోగపడవచ్చు.మరోవైపు ఈ ఉపఎన్నిక ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వానికి పెద్ద పరీక్షగా నిలవనుంది. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి నగరంలో ఆశించిన స్థాయిలో సీట్లు రాలేదు. ఆ తర్వాత జరిగిన సికింద్రాబాద్ కంటోన్మెంట్,, జూబ్లీహిల్స్ ఉపఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపొందింది. అయినా.. హైదరాబాద్ రాజకీయాలపై పట్టు సాధించాల్సిన అవసరం సీఎం రేవంత్ రెడ్డికి ఉంది.మరోవైపు.. గతంలో బీఆర్ఎస్‌తో ఎన్నికల అవగాహన కలిగి ఉన్న మజ్లిస్ పార్టీ ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని పలు అంశాల్లో సమర్థిస్తోంది. ఈ మారుతున్న రాజకీయ సమీకరణాల మధ్య.. ఖైరతాబాద్ గెలుపు కోసం కాంగ్రెస్ పార్టీ ఎలాంటి వ్యూహాలు రచిస్తుంది.. అనేది వేచి చూడాలి. ఏది ఏమైనప్పటికీ.. ఖైరతాబాద్ ఉపఎన్నిక ఫలితం తెలంగాణ రాజకీయాల్లో కీలక మార్పులకు నాంది పలకడం ఖాయం.




# పాలకొల్లులో డ్వాక్రా మాహా,ఋాదీ ల ఆత్మీయ సమావేశంలో పాల్గొన్న మంత్రి నిమ్మల రామానాయుడు.





**పాలకొల్లు ; సెప్టెంబర్ 26 మీ వార్త జిల్లా ప్రతినిధి.**డ్వాక్రా మహిళలకు వినాయక చవితి, దసరా పండుగలను పురస్కరించుకుని చీరలు అందజేసిన మంత్రి నిమ్మల. డ్వాక్రా అంటేనే చంద్రబాబు... చంద్రబాబు అంటేనే డ్వాక్రా. మహిళలు ఆర్థిక శక్తిగా ఎదిగేలా భారతదేశంలోనే తొలిసారిగా డ్వాక్రా సంఘాలను ఏర్పాటుచేసిన ఘనత చంద్రబాబు నాయుడు ది.డ్వాక్రా సంఘాల ద్వారా మహిళలు సాధిస్తున్న విజయాలను ప్రపంచమంతా ఆంధ్రప్రదేశ్ వైపు చూసేలా చేశారు.
ఆనాడు డ్వాక్రా సిఏ, ఆర్పి లకు తొలిసారిగా జీతాలు వ్యవస్థను తీసుకువచ్చిన టిడిపి ప్రభుత్వం. ఒక్క ఛాన్స్ అంటూ అధికారంలోకి వచ్చిన గొడ్డల పార్టీ అప్పుల మీద అప్పులు చేసి రాష్ట్రంలో చిల్లి గవ్వ లేకుండా చేశారు.గత ఐదేళ్ల పాలనలో పోలవరం, అమరావతి రాజధాని ధ్వంశమే కాదు, అభివృద్ధిలో 20 ఏళ్లు వెనక్కి వెళ్ళింది.గత గొడ్డలి పార్టీ రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని వెంటిలేటర్ స్థితికి తీసుకువెళ్తే నేడు చంద్రబాబు, పవన్ కళ్యాణ్, మోదీల కలయికతో గాడిలో పెడుతున్న కూటమి ప్రభుత్వం.నేడు పెన్షన్లు సొమ్ము పెంపు, తల్లికి వందనం, అన్న క్యాంటీన్, ఏడాదికి మూడు ఉచిత వంట గ్యాస్ సిలిండర్లు, మహిళలకు ఉచిత ఆర్టీసీ బస్ ప్రయాణం వంటి సంక్షేమ పథకాలతో పాటు అభివృద్ధి దిశగా పాలన నడుస్తుంది.

# ఘనంగా ప్రపంచ పర్యాటక దినోత్సవం

**ముఖ్య అతిధితిగా పాల్గొన్న వైస్ ప్రిన్సిపాల్ : ముల్లి శేఖర్**

**చింతూరు,సెప్టెంబర్ 26 మీ వార్త ప్రతినిధి :** ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చరిత్ర విభాగం ఆధ్వర్యంలో ప్రపంచ పర్యాటక దినోత్సవం ఘనంగా నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎన్.మణిమాల తెలిపారు. ఈ కార్యక్రమానికి కళాశాల వైస్ ప్రిన్సిపల్ ముల్లి.శేఖర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడుతూ చింతూరు పరిసర ప్రాంతాలలో గొప్ప పర్యాటక ప్రాంతాలు ఉన్నాయని దానికి ఉదాహరణగా పొల్లూరు జలపాతం మోతుగూడెం పరిసర ప్రాంతాలు గొప్ప పర్యాటక ప్రదేశాలుగా వెలుగొందుతున్నాయని తెలిపారు.ఈ ప్రాంతాలు పర్యాటకులను ఆకర్షిస్తున్నాయని నిత్యము పర్యాటకులతో సందడి చేస్తున్నాయని తెలిపారు. ఐ.క్యు.ఏ.సి.కో ఆర్డినేటర్ డాక్టర్.వై.పద్మ మాట్లాడుతూ అంతర్జాతీయ సమాజంలో పర్యాటక పాత్ర మీద అవగాహన పెంచడం అది ప్రపంచవ్యాప్తంగా సామాజిక సాంస్కృతిక రాజకీయ ఆర్థిక విలువలను ఎలా ప్రభావితం చేసిందో తెలిపారు.ఇంగ్లీష్ అధ్యాపకులు ఎం.రాకేష్ రాజ్ మాట్లాడుతూ 1980 నుండి ఐక్యరాజ్యసమితి ప్రపంచ పర్యాటక సంస్థ ఈ వేడుకలను సెప్టెంబర్ 27న నిర్వహిస్తుందని తెలిపారు. జువాలజీ అధ్యాపకులు కె.సత్య గణేష్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం మిలియన్ల మంది పర్యాటకులు నూతన గమ్యస్థానాలను చూడడానికి విభిన్న సంస్కృతులను చూసి ఆనందించి అనుభవించడానికి శాశ్వత జ్ఞాపకాల కొరకు ప్రజలు ప్రపంచవ్యాప్తంగా సరిహద్దులు దాటి ఆయా ప్రదేశాలను చూస్తున్నారని తెలిపారు.చరిత్ర అధ్యాపకులు బి.శ్రీనివాసరావు మాట్లాడుతూ పర్యాటక రంగం నుంచి వచ్చే ఆదాయం పెరగడం వల్ల మెరుగైన జీవన ప్రమాణాలు ఆరోగ్యం విద్య ఇతర అవసరాలకు మెరుగైన ప్రాప్యత లభిస్తుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో డా.జి.ఝాన్సీ జి. సాయికుమార్ ఎన్.ఆనంద్ కోట్ల.లక్ష్మీ ప్రసన్న అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది మరియు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.



# ప్రజా సంక్షేమం గాలికి వదిలేసిన కూటమి ప్రభుత్వం...

**నిరుద్యోగభృతి ఇవ్వని ప్రభుత్వం... ప్రభుత్వ ప్రచారానికి మాత్రం చెల్లింపులు**

**మాజీ ఎంపీ చింతా అనురాధ**



**అమలాపురం, సెప్టెంబర్ 26 ( మీ వార్త ప్రతినిధి ):**ప్రజలకు ప్రభుత్వాన్ని చేరువ చేయాలనే గొప్ప లక్ష్యంతో నాడు ముఖ్యమంత్రి గా వైయస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం తీసుకొచ్చిన వాలంటీర్ వ్యవస్థను పక్కనపెట్టి.. ఇప్పుడు ప్రభుత్వ పథకాలను ప్రచారం చేసేందుకు సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లను ఎంప్యానెల్ చేయడం కూటమి ప్రభుత్వ ప్రచార ఆర్భాటానికి నిదర్శనమని అమలాపురం మాజీ పార్లమెంట్ సభ్యులు చింతా అనురాధ విమర్శించారు.ప్రతి 50 కుటుంబాలకు ఒక వాలంటీర్‌ను ఏర్పాటు చేసి ప్రజలకు సంక్షేమ ఫలాలను ఇంటి వద్దకే చేర్చిన వాలంటీర్ వ్యవస్థను కనుమరుగు చేసిన కూటమి ప్రభుత్వం ఇప్పుడు ప్రభుత్వ ప్రచారం కోసం ఇన్‌ఫ్లుయెన్సర్లను మాత్రం వెతుకుతోందని అన్నారు.ఎన్నికల సమయంలో యువతకు ఉద్యోగాలు, నిరుద్యోగులకు నెలకు రూ.3,000 నిరుద్యోగ భృతి ఇస్తామని, వాలంటీర్ల గౌరవ వేతనాన్ని రూ.5 వేల నుంచి రూ.10 వేలకు పెంచుతామని హామీ ఇచ్చారని గుర్తుచేశారు.
నిరుద్యోగులకు ఇచ్చిన హామీలను అమలు చెయ్యకుండా ఎన్నికలప్పుడు ఇచ్చిన హామీలను అమలు చేయడానికి నిధులు లేవని చెబుతూ ప్రభుత్వ ప్రచారం కోసం ఇన్‌ఫ్లుయెన్సర్లకు చెల్లింపులు చేయడానికి మాత్రం ఎక్కడి నుంచి నిధులు వస్తున్నాయని ఆమె ప్రశ్నించారు.ఇది ప్రజా పాలనా? లేక ప్రచార పాలనా అని ప్రశ్నించారు.ప్రజలకు ఉపయోగపడే వాలంటీర్ వ్యవస్థను పక్కనపెట్టి.. ఇచ్చిన హామీలను అమలు చేయకుండా.. ప్రజాధనంతో ప్రభుత్వ ప్రచారానికి కొత్త వ్యవస్థను తీసుకురావడం ఏమిటని ఆమె నిలదీశారు.ప్రజలకు కావాల్సింది సోషల్ మీడియాలో కనిపించే ప్రచారం కాదని వారి కళ్లముందు కనిపించే అభివృద్ధి, సంక్షేమం కావాలని తెలిపారు. కూటమి ప్రభుత్వం అనవసరపు ఆర్భాట ప్రచారంపై దృష్టి పెట్టడం మానేసి.. ముందుగా ఇచ్చిన హామీలను అమలు చేయాలని, ప్రజా సమస్యలను పరిష్కరించాలని, రాష్ట్ర అభివృద్ధి మరియు సంక్షేమంపై దృష్టి పెట్టాలని చింతా అనురాధ హితవు పలికారు.

# విధి నిర్వహణలో ప్రజల భద్రతే లక్ష్యం:

### మంత్రి గొట్టిపాటి రవికుమార్,జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు

### ఘనంగా ముగిసిన పోలీస్ పాసింగ్ అవుట్ పెరేడ్

**ఒంగోలు : సెప్టెంబర్ 27(మీ వార్త జిల్లా ప్రతినిధి)** ఆంధ్రప్రదేశ్ పోలీస్ శాఖలోకి సివిల్ కానిస్టేబుళ్లుగా ఎంపికైన 190 మంది స్టైపెండరీ కానిస్టేబుళ్లకు జిల్లా పోలీస్ ట్రైనింగ్ సెంటర్‌లో నిరవధికంగా తొమ్మిది నెలల పాటు కఠోర శిక్షణ అనంతరం, శనివారం జిల్లా పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో పాసింగ్ అవుట్ పరేడ్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ హాజరయ్యారు. అత్యంత వైభవంగా దీక్షాంత్ పరేడ్ నిర్వహించారు.

కమాండర్‌గా ఉన్న మహమ్మద్ రజా పరేడ్‌కు ఆధిక్యం వహించి సమర్థవంతంగా నిర్వహించారు. వేదికపైకి విచ్చేసిన ముఖ్య అతిథి, అతిథులకు శిక్షణ పొందిన కానిస్టేబుళ్లు గౌరవ వందనం సమర్పించారు.. పరేడ్‌ను వీక్షించేందుకు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వాహనంలో రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ప్రకాశం జిల్లా ఎస్పీతో కలిసి పాల్గొన్నారు . ఈ సందర్భంగా కానిస్టేబుళ్ల యూనిఫామ్, టర్న్‌అవుట్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ తొమ్మిది నెలల కఠినమైన ప్రాథమిక పోలీస్ శిక్షణను విజయవంతంగా పూర్తి చేసుకుని ప్రజాసేవలోకి అడుగుపెడుతున్న 190 మంది నూతన పోలీస్ కానిస్టేబుళ్లకు హృదయపూర్వక అభినందనలు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 6,100 ఎస్.సి.టీ పోలీస్ కానిస్టేబుల్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ జారీ చేసిందని, సుమారు 5 లక్షల మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకోగా, వివిధ దశల ఎంపిక ప్రక్రియ అనంతరం సుమారు 5,800 మంది ఎంపికైనట్లు తెలిపారు. శిక్షణార్థుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని నెలవారీ స్టైపెండ్‌ను రూ.4,500 నుంచి రూ.12,000కు పెంచడం జరిగిందని పేర్కొన్నారు. జిల్లా పోలీస్ ట్రైనింగ్ సెంటర్‌లో డిసెంబర్ 22, 2025న ప్రారంభమైన ఈ బ్యాచ్‌లో మొత్తం 198 మంది శిక్షణార్థులకు శిక్షణ కేటాయించగా, 193 మంది రిపోర్ట్ అయ్యారని, వివిధ ఉద్యోగాలకు ఎంపికైన ముగ్గురిని మినహాయించి ప్రస్తుతం 190 మంది శిక్షణార్థులు పాసింగ్ అవుట్ పరేడ్‌లో పాల్గొంటున్నారని తెలిపారు. వీరంతా పూర్వపు తూర్పుగోదావరి జిల్లాకు చెందినవారని పేర్కొన్నారు. ఈ బ్యాచ్‌లో పీజీ 16 మంది, బీటెక్ 34 మంది, డిగ్రీ 121 మంది, ఇంటర్మీడియట్ 19 మంది ఉన్నారని తెలిపారు. ఉన్నత విద్యార్హతలు కలిగిన యువత పోలీస్ శాఖలో చేరడం అభినందనీయమని, విధులను సమర్థవంతంగా నిర్వహిస్తూనే భవిష్యత్తులో మరింత ఉన్నత స్థాయికి ఎదగడానికి కృషి చేయాలని ఆకాంక్షించారు. "పోలీస్ యూనిఫాం అధికారం కోసం కాదు.. బాధ్యత కోసం". ప్రతి పౌరుడితో గౌరవంగా, బాధితులతో సానుభూతితో వ్యవహరిస్తూ, చట్టాన్ని నిష్పక్షపాతంగా అమలు చేయాలని సూచించారు. తొమ్మిది నెలల శిక్షణతో అభ్యాసం పూర్తయిందని భావించకుండా, మారుతున్న నేరాల నేపథ్యంలో సైబర్ క్రైమ్, డిజిటల్ టెక్నాలజీ, ఆధునిక దర్యాప్తు పద్ధతులపై నిరంతరం అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. నిజాయితీని బలంగా, క్రమశిక్షణను అలవాటుగా, చట్టాన్ని మార్గదర్శకంగా, ప్రజాసేవను లక్ష్యంగా చేసుకుని విధులు నిర్వహించాలని నూతన కానిస్టేబుళ్లకు సూచించారు. నిత్యం ధ్యానం చేయడం వలన మనసు ప్రశాంతంగా, నిలకడగా ఉంటుందని, తద్వారా నేరాలను గుర్తించడంలో ఏకాగ్రత పెరగడంతో పాటు, ఆరోగ్యంగా ఉంటే అనుకున్న లక్ష్యాలను సాధించవచ్చని అన్నారు. ఈ స్థాయికి చేరుకోవడంలో



తల్లిదండ్రుల త్యాగాలు, ఆశీస్సులు ఎంతో ముఖ్యమైనవని, వాటిని ఎల్లప్పుడూ గుర్తుంచుకోవాలని తెలిపారు. నూతన కానిస్టేబుళ్లు తమ సేవా ప్రయాణంలో అంకితభావంతో పనిచేసి, వారి కుటుంబాలకు, పోలీస్ శాఖకు మరియు రాష్ట్రానికి మంచి పేరు తీసుకురావాలని ఎస్పీ ఆకాంక్షించారు.

పార్లమెంటు సభ్యుడు మాగుంట శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ ప్రతి ఉద్యోగికి ట్రైనింగ్ అనేది జీవితంలో ముఖ్యమైన బాగమని అన్నారు. మంచి నాయకత్వం కల్గిన జిల్లా ఎస్పి హర్షవర్ధన్ రాజు అధ్వర్యంలో మంచి నైపుణ్యం కలిగిన కమాండర్లు తో కానిస్టేబుల్స్ ట్రైనింగ్ తీసుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు. ముఖ్యంగా ఇప్పుడు ఉన్న పరిస్థితిని బట్టి ప్రతి ఒక్క పోలీసు సిబ్బందికి మెడిటెషన్ ట్రైనింగ్ కూడా చాలా ముఖ్యమన్నారు.మెడిటెషన్ ట్రైనింగ్ కూడా ఇవ్వాలని నేను కోరుకుంటున్నానన్నారు. ఇలాంటి ట్రైనింగ్ ఇచ్చినప్పుడే ఎంతటి క్రైం ఇన్వెస్టిగేషన్ అయిన ఇట్టే ఛేదించగలని తెలియచేశారు. మనలో వత్తిడి లేన్నప్పుడే ఎంత పెద్ద సమస్య అయిన ఇట్టే ఛేదించవచ్చన్నారు. ప్రకాశం జిల్లా కలెక్టర్ "పి.రాజాబాబు" ఐఏఎస్ మాట్లాడుతూ ట్రైనింగ్ పూర్తి చేసుకుని రియల్ లైఫ్ లో అడుగుపెట్టడం సంతోషంగా ఉందని క్రమశిక్షణతో కూడిన జీవితం గడిపితేనే మీరు చేస్తున్న ఉద్యోగానికి వన్నేతెచ్చి ప్రభుత్వానికి మంచి పేరు ప్రతిష్టలు తీసుకురావాలని ప్రకాశం జిల్లా కలెక్టర్ రాజాబాబు అన్నారు. న్యాయం కోసం పోలీస్ స్టేషను కు వచ్చే పేదల పట్ల, మహిళలు పట్ల, చిన్నారులను గౌరవించే విధంగా ఉండాలన్నారు. రాబోయే కాలంలో ప్రతిఒక్కరూ టెక్నాలజీ తో పోటిపడాలని, టెక్నాలజీని ఉపయోగిస్తేనే అనేక కేసులు ఛేదిస్తామని, యువ కానిస్టేబుల్ టెక్నాలజీ పై ప్రత్యేక దృష్టి పెటాల్సిన అవసరం చాలా ఉందన్నారు. ప్రకాశం జిల్లా ఎస్పీ మాట్లాడుతూ ఒంగోలు డీటీసీలో ప్రస్తుత బ్యాచ్‌కు చెందిన పూర్వపు తూర్పుగోదావరి జిల్లాకు చెందిన 190 మంది ఎస్.సి.టీ.పీ.సీ లకు తొమ్మిది నెలల పాటు క్రమశిక్షణతో కూడిన నాణ్యమైన శిక్షణ అందించినట్లు తెలిపారు. శిక్షణలో భాగంగా చట్టాలు, క్రిమినల్ లాస్, లా అండ్ ఆర్డర్, ఫిజికల్ ఫిట్‌నెస్, పరేడ్ డ్రిల్, ఆయుధాల వినియోగం, ట్రాఫిక్ నియంత్రణ, స్విమ్మింగ్, డ్రైవింగ్‌తో పాటు సైబర్ క్రైమ్, ఫోరెన్సిక్ సైన్స్, డిజిటల్ ఎవిడెన్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, సైబర్ సెక్యూరిటీ వంటి ఆధునిక పోలీసింగ్ అంశాలపై కూడా శిక్షణ అందించినట్లు తెలిపారు.

అదేవిధంగా సీసీటీఎన్ఎస్, ఈ-సాక్ష్య,, ఈ-సమన్స్, ఈ-ఫోరెన్సిక్, సీడీఆర్ డ ఐఎంఈఐ విశ్లేషణ, మొబైల్ పోలీస్ అప్లికేషన్ల వినియోగంపై శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా వినియోగించుకునే విధంగా శిక్షణార్థులను తీర్చిదిద్దినట్లు తెలిపారు.

శిక్షణలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన బెస్ట్ ఇండోర్‌గా ఛెస్ట్ నంబర్ 13 పి.ప్రశాంత్, బెస్ట్ అవుట్‌డోర్‌గా ఛెస్ట్ నంబర్ 45 జి.రవి, బెస్ట్ ఫైరర్‌గా ఛెస్ట్ నంబర్ 162 కె.రామకృష్ణ,




బెస్ట్ ఆల్‌రౌండర్‌గా ఛెస్ట్ నంబర్ 13 పి.ప్రశాంత్ నిలిచినట్లు తెలిపారు. వారిని ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు. ఈ బ్యాచ్‌లో పీజీ, బీటెక్, డిగ్రీ వంటి ఉన్నత విద్యార్హతలు కలిగిన వారు కూడా ఉన్నారు. ప్రతి ఒక్కరూ తమ విద్యార్హతలకు అనుగుణంగా జ్ఞానాన్ని, నైపుణ్యాలను మరింత పెంపొందించుకుంటూ, పోలీస్ శాఖలో అంకితభావంతో విధులు నిర్వహించాలని కోరుకుంటున్నాను. ప్రస్తుత బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తిస్తూనే, భవిష్యత్తులో ఉన్నత ఉద్యోగాలు సాధించే దిశగా కృషి చేయాలని ఆకాంక్షిస్తున్నాను.

ప్రజల భద్రతే ధ్యేయంగా, ప్రజాసేవే కర్తవ్యంగా భావించి, క్రమశిక్షణ, నిజాయితీ, నిబద్ధత, ధైర్యసాహసాలతో విధులు నిర్వహించాలని నూతన కానిస్టేబుళ్లకు జిల్లా ఎస్పీ సూచించారు. ప్రజలతో మర్యాదగా వ్యవహరిస్తూ, బాధితుల సమస్యలను సానుభూతితో విని, చట్టాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని తెలిపారు.

పోలీస్ శాఖలో చేరడం కేవలం ఉద్యోగం మాత్రమే కాదని, ప్రజల భద్రత మరియు శాంతిభద్రతల పరిరక్షణ అనే గొప్ప బాధ్యతను స్వీకరించడమని ఎస్పీ పేర్కొన్నారు. తల్లిదండ్రులు తమపై పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టుకోవడంతో పాటు, ప్రజల విశ్వాసాన్ని కూడా కాపాడాలని సూచించారు.

నూతన కానిస్టేబుళ్లు అంకితభావంతో విధులు నిర్వహిస్తూ పోలీస్ శాఖకు, శిక్షణా కేంద్రానికి మరియు వారి తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని ఎస్పీ ఆకాంక్షించారు.

ఒంగోలు శాసన సభ్యులు "దామచర్ల జనార్ధన్" మాట్లాడుతూ సమసమాజం కోసం ట్రైనింగ్ పూర్తి చేసుకున్న ప్రతిఒక్క కానిస్టేబుల్ కృషి చేయాలని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎర్పాటు చేసి సమయం నుండి కీలకమైన డిపార్ట్మెంట్ లో ప్రభుత్వం నూతనంగా నోటిఫికేషన్ ఇచ్చి యువకులకు ఉద్యోగ అవకాశాలు కల్పించడం జరిగిందన్నారు. ప్రజా సేవలో అడుగుపెట్టడం చాలా సంతోషంగా ఉందన్నారు. మీరు చేసే సేవ మీ కుటుంబ తోపాటు రాష్ట్ర ప్రభుత్వానికి కూడా గౌరవం తీసుకురావాలన్నారు.

సంతనూతలపాడు ఎమ్మెల్యే "విజయకుమార్" మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగం రావాలని ప్రతి ఒక్కరూ అశపడతారని రావడం మీ అందరూ ట్రైనింగ్ పూర్తి చేసుకుని పోలీసు కానిస్టేబుల్ గా విధి నిర్వహణ లోకి అడుగుపెట్టడం నాకు చాలా సంతోషంగా ఉందని అన్నారు. ఒక కేసు జరిగినప్పుడు మొదట అక్కడ కు వెళ్ళేది మీరే అని మీరు ఇచ్చే సమాచారం తోనే కేసు ఇన్వెస్టిగేషన్ ముందుకు సాగుతుందన్నారు. మీరు నీతి నిజాయితీగా పని చేస్తే... కేసు నిలబడుతుందని గుర్తు చేశారు. నీతి నిజాయితీ పని చేసి ఇంకా ఉన్నతస్థాయికి ఎదగాలన్నారు. రాష్ట్ర అభివృద్ధి చెందాలంటే ఆ రాష్ట్రంలో లా అండ్ అర్డర్ కంట్రోల్ లో ఉంటేనే ఆ రాష్ట్రం అభివృద్ధి చెందుతుందన్నారు. రాష్ట్ర అభివృద్ధి లో మీ అందరూ భాగస్వాములు అవడం చాలా సంతోషంగా ఉందన్నారు.

# ఉద్యాన రైతులకు విశ్వావిద్యాలయం అండగా ఉంటుంది

### ఉపకులపతి డా. కే. ధనుంజయరావు

**తాడేపల్లిగూడెం, సెప్టెంబర్ 26 (మీ వార్త ప్రతినిధి)** భారీ వర్షాలు, వరదలతో నష్టపోయిన ఉద్యాన రైతులకు డా. వై.ఎస్.ఆర్. ఉద్యాన విశ్వవిద్యాలయం అండగా ఉంటుందని ఉపకులపతి డా. కట్టుపల్లి ధనుంజయరావు తెలిపారు.శుక్రవారం విశ్వావిద్యాలయం విస్తరణ సంచాలకులు డా. సిహెచ్ రూత్,పరిశోధనా సంచాలకులు డా. ఎస్ సూర్యకుమారి లతో కలిసి ఒక ప్రకటనలో ఉపకులపతి ధనుంజయరావు మాట్లాడుతూ సెప్టెంబర్ 22 నుండి 25 వరకు ఏర్పడిన అల్పపీడనం, తీవ్ర వాయుగుండం కారణంగా రాష్ట్రంలో 12 జిల్లాల్లోని 84 మండలాలు, 286 గ్రామాల్లో 1,392 హెక్టార్లలో తోటలు నీట మునిగి 4,598 మంది రైతులు సుమారు రూ.28.09 కోట్ల నష్టపోయారని ప్రాథమిక అంచనా వేసినట్లు తెలిపారు.

**రైతులు చేపట్టాల్సిన చర్యలు:**

1. సాధారణ జాగ్రత్తలు: తోటల్లో నిలిచిన నీటిని వెంటనే కాలువలు తవ్వి బయటకు పంపాలి. గాలికి పడిపోయిన మామిడి, అరటి, ఆయిల్ పామ్ మొక్కలను నిలబెట్టి కర్రలతో ఊతం ఇవ్వాలి.
2. అరటి: 75% పక్వానికి వచ్చిన గెలలను వెంటనే కోసి మార్కెట్ కు తరలించాలి. 13-0-45 ఎరువును 0.5% చొప్పున ఆకులపై పిచికారీ చేయాలి. దుంపకుళ్ళ నివారణకు కాపర్ ఆక్సిక్లోరైడ్ 3 గ్రా/లీ చొప్పున మొదళ్లలో పోయాలి.
3. మామిడి, జీడిమామిడి: విరిగిన కొమ్మలను కత్తిరించి కాపర్ ఆక్సీక్లోరైడ్ పేస్ట్ పూయాలి. లేత తోటల్లో 19:19:19 ఎరువును 5 గ్రా/లీ చొప్పున పిచికారీ చేయాలి.
4. కొబ్బరి, ఆయిల్ పామ్: మువ్వలను శుభ్రం చేసి కాపర్ ఆక్సీక్లోరైడ్ ద్రావణం పోయాలి. పడిపోయిన



చెట్లకు 20% అదనపు ఎరువులతో పాటు 1 కిలో సూపర్ ఫాస్ఫేట్, 2 కిలోల వర్మీ కంపోస్ట్ వేయాలి.
5. కూరగాయలు, మిరప, పూలు: పడిపోయిన మొక్కలను నిలబెట్టి 13-0-45 లేదా యూరియా పిచికారీ చేయాలి. తీవ్రంగా దెబ్బతిన్న తోటలను తొలగించి రబీ సీజన్ పంటలు వేసుకోవచ్చు.

రైతులు అధైర్యపడవద్దని, సాంకేతిక సహాయం కోసం కృషి విజ్ఞాన కేంద్రాలు, ఉద్యాన పరిశోధనా స్థానాల శాస్త్రవేత్తలను సంప్రదించాలని ఉపకులపతి సూచించారు.

# నష్టపోయిన రైతులను ఆదుకుంటాం ఎమ్మెల్యే బొలిశెట్టి





**తాడేపల్లిగూడెం సెప్టెంబర్ 26 (మీ వార్త ప్రతినిధి)** అకాల వర్షాలతో నష్టపోయిన ప్రతి రైతును ప్రభుత్వం ఆదుకుంటుందని ప్రభుత్వ విప్,ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ భరోసా ఇచ్చారు. తాడేపల్లిగూడెం మండలం జగన్నాథపురంలో వరద ముంపునకు గురైన వరి పొలాలను శనివారం ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించి రైతులతో మాట్లాడారు.ఎర్రకాలువ గండ్లు పూడ్చడం, షట్టర్లు ఏర్పాటు చేయడం వల్ల ముంపు తీవ్రత తగ్గిందని, ఎగువ నుంచి వచ్చిన వరద నీటితో పంట మునిగిందన్నారు. కాలువల్లో తూడు సమస్యను తొలగిస్తున్నామని, భవిష్యత్తులో ఇలాంటి సమస్య రాకుండా శాశ్వత చర్యలు తీసుకుంటామని చెప్పారు.నష్టపోయిన రైతుల వివరాలను నమోదు చేయాలని అధికారులను ఆదేశించారు.ఇన్‌పుట్ సబ్సిడీ అందలేదని రైతులు చెప్పగా, ఆ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లామని, త్వరలోనే సబ్సిడీ మంజూరు అయ్యేలా చూస్తామని హామీ ఇచ్చారు.ఈ పర్యటనలో బీజేపీ రాష్ట్ర నాయకులు ఈతకోట తాతాజీ,ఇంచార్జ్ ఏడిఏ నారాయణ, ఎంపీడీఓ వి చంద్రశేఖరం,మండల అధికారులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

# పాయకరావుపేట మండల స్పెషల్ ఆఫీసరుగా శ్రీరాములు,,



**పాయకరావుపేట, మీ వార్తా ప్రతినిధి,,**సెప్టెంబరు 26 : మండల స్పెషల్ ఆఫీసరుగా కె శ్రీరాములు నియమితులయ్యారు. ఈ మేరకు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శ్రీరాములు ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. అనకాపల్లి జిల్లా కేంద్రంలోని సమగ్ర శిక్షా అభియాన్ అడిషనల్ ప్రోజెక్ట్ కో ఆర్డినేటరుగా పని చేస్తోన్న శ్రీరాములను పాయకరావుపేట మండల పరిషత్ కార్యాలయ స్పెషల్ ఆఫీసరుగా అధికారులు నియమించారు. ఈ సందర్భంగా స్పెషల్ ఆఫీసర్ శ్రీరాములు మాట్లాడుతూ... మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లోనూ "స్వచ్ఛత హీ సేవా -2026" కార్యక్రమంలో భాగంగా పూర్తి స్థాయిలో శానిటేషన్ పనులు చేపడుతున్నామన్నారు. ప్రతీ నెలా మూడవ శనివారం "స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివాస్" కార్యక్రమం నిర్వహిస్తూ గ్రామాల్లోని రోడ్ల ప్రక్కన ఉన్న చెత్త కుప్పలు తొలగించడం, డ్రెయిన్లలో పేరుకుపోయిన మురుగు తొలగించడం వంటి పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తి నిషేధించాలని కోరుతూ ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. ప్రజల ఆరోగ్య పరిరక్షణ కోసం ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ కార్యక్రమాలకు అందరూ సహకరించాలని శ్రీరాములు కోరారు.

# ఎమ్మెల్యే బొలిశెట్టి కి కృతజ్ఞతలు తెలిపిన మాజీ ఎంపీపీ వెంకటలక్ష్మి కృష్ణ ప్రసాద్



**తాడేపల్లిగూడెం, సెప్టెంబర్ 26 (మీ వార్త ప్రతినిధి)** పెంటపాడు మండల పరిషత్ అధ్యక్షురాలిగా (ఎంపీపీ) అవకాశం కల్పించినందుకు కృతజ్ఞతగా, మాజీ ఎంపీపీ కట్టుబోయిన వెంకటలక్ష్మి కృష్ణ ప్రసాద్ దంపతులు తాడేపల్లిగూడెం శాసనసభ్యులు, ప్రభుత్వ విప్ బొలిశెట్టి శ్రీనివాస్ ను మర్యాదపూర్వకంగా కలిసి పదవి పూర్తయిన సందర్భంగా ఎమ్మెల్యే కు కృతజ్ఞతలు తెలిపి సత్కరించారు.ఈ సందర్భంగా వెంకటలక్ష్మి కృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ తనకు ఎంపీపీగా అవకాశం కల్పించడంతో పాటు, మండల అభివృద్ధికి ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ అందించిన సహకారం మరువలేనిదని కొనియాడారు. తమకు అండగా నిలిచినందుకు ధన్యవాదాలు తెలిపారు.ఎన్నో ఏళ్ళుగా కొందరి వెనక తిరిగి వెనుకబడిపోయాం అన్నారు. కానీ ఎమ్మెల్యే బొలిశెట్టి మాత్రమే తమకు పార్టీలో సముచిత న్యాయం కల్పించడంతో పాటు మంచి గుర్తింపు ఇచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన పెంటపాడు మండలం అధ్యక్షుడు పుల్లా బాబీ, నాయకులు మైలవరపు పెదబాబు, కూచిపూడి అనిల్ తదితరులు పాల్గొన్నారు.

# మున్సిపల్ కమిషనర్ కు వినతి పత్రం అందజేసిన

### జనసేన పార్టీ నగర అధ్యక్షుడు గడ్డంరాజు



**మచిలీపట్నం సెప్టెంబర్ 26(మీ వార్త ప్రతినిధి)**బందరు పోర్ట్ రోడ్డు వెంటనే అభివృద్ధి పరచాలని రోడ్డుపై నిలిచిన నీటిని తొలగించవలసిందిగా వినతి.రోడ్డుపై పెద్ద ఎత్తున నీరు నిలిచి ఉంది. దీంతో ప్రజలు, ముఖ్యంగా వృద్ధులు, మహిళలు మరియు పిల్లలు రాకపోకలు సాగించడానికి చాలా,ఇబ్బందులుపడుతున్నారని తెలిపారు .బ్రిటిష్ కాలంనాటి రోడ్డును వెంటనే నూతన రోడ్డు నిర్మాణం చేపట్టాలని కమిషనర్ కు వినతి పత్రం అందజేశారు.సోమవారం గ్రీవెన్స్ ద్వారానగర పాలక సంస్థ స్పెషల్ అధికారి అయిన జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ దృష్టికితీసుకువెళ్తామని గడ్డం రాజు తెలిపారు .జనసేన పార్టీ మచిలీపట్నం నగర అధ్యక్షుడు గడ్డం రాజు

Edited Printed Published & Owned by U. SHEKHAR. And Printed at Mani Raghava Printers, #A-20, Vambay Colony, Hyderabad, Rajendranagar, Rangareddy, Telangana.
Published at Manikanta Publications, H.No. 3-67/3/66, Netaji Nagar, Nallagandla, Serilingampally, Rangareddy (Dist), Telangana, EDITOR U.SHEKHAR, RNI. NO. TEL/2018/77112

